RNI Reg-No. APTEL/2002/07373

Postal Registration No.VJ/215/2025-27

# నేటి మనదేశమ్

NETIMANADESAM TELUGU DAILY

తెలుగు దినపత్రిక

Simultaneously published from Vijayawada, Visakhapatnam, Tirupati & Hyderabad

సంపుటి :24 Vol. No.24 సంచిక : 151 Issue No. 151 విజయవాడ Vijayawada సంపాదకులు: కె.ఎస్.రంగశాయి: శనివారం 30-05-2026 Saturday, May 30 2026 పేజీలు : 8 Pages: 8 వెల: రూ.1-00 Price Rs.1-00

## ఏపీ పీజీసెట్ ఫలితాలు విడుదల

ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ 'ఎక్స్' వేదికగా వెల్లడి



**అమరావతి, మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఏపీ పోస్టు గ్రాడ్యుయేట్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీపీజీసెట్-2026) ఫలితాలు విడుదలయ్యాయి. మే 8 నుంచి 11 వరకు మిగతా 2లో..

## నీట్ పేపర్ లీక్ బాధ్యత ఎవరిది

యూపిపిఎస్సిని చూసి నేర్చుకోండి

విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఆందోళనకు బాధ్యులెవరు

నీట్ పేపర్ లీక్‌పై మరోమారు సుప్రీం ఆగ్రహం





**న్యూఢిల్లీ, మే 29 (ఆర్ఎన్ఎ):** నీట్ యూజీ పరీక్ష పేపర్ లీక్ వివాదంపై సుప్రీం కోర్టు మరోసారి తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. పర్యవేక్షణా యంత్రాంగాలు, సంబంధిత కమిటీలు ఉన్నప్పటికీ ఇంత పెద్ద ఉల్లంఘన ఎలా జరిగిందని కేంద్రాన్ని ప్రశ్నించింది. ఇలాంటి సంఘటన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు తీవ్ర మానసిక క్షోభను కలిగిస్తుందని, వారిని ఇలా నిరాశపెట్టడం సరికాదని అభిప్రాయపడింది. పేపర్ లీక్ విషయంలో లోపాలకు జవాబు దారీతనం ఉండాల్సిందేనని, అప్పటి వరకు అసలు సమస్య ఆగదని వ్యాఖ్యానించింది. అయితే, యువత ఆందోళనలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణనలోకి తీసుకుంటోందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీం ధర్మాసనానికి వెల్లడించారు. పరిస్థితిని ప్రధానమంత్రి కూడా వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తున్నారని మిగతా 2లో..

## మాజీమంత్రి గాదె వెంకట్‌రెడ్డి కన్నుమూత


(ఫైల్ ఫోటో)

**హైదరాబాద్, మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, సీనియర్ రాజకీయ నాయకుడు గాదె వెంకటరెడ్డి కన్నుమూశారు. గతకొద్ది రోజులుగా వయోభారం, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతోన్న ఆయన శుక్రవారం హైదరాబాద్‌లోని నివాసంలో తుదిశ్వాస విడిచారు. వెంకటరెడ్డి మృతిని ఆయన కుటుంబ సభ్యులు ధృవీకరించారు. వెంకటరెడ్డి మరణంపై పలువురు రాజకీయ నాయకులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. 1940 జూలై 10న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా ఇంకొల్లు మండలం పావులూరు గ్రామంలో గాదె వెంకటరెడ్డి జన్మించాడు. ఎల్ఎల్‌బీ పూర్తి చేసిన ఆయన కాంగ్రెస్ పార్టీ రాజకీయ అరంగ్రేటం చేశారు. 1967లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పరుచూరు నియోజకవర్గం మిగతా 2లో..

## 'నైరుతి' రాక మరింత ఆలస్యం



**విజయవాడ, మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండుటెండలతో అల్లాడిపోతున్న ప్రజలకు ఇప్పుడప్పుడే ఉపశమనం లభించేలా కన్పించట్లేదు. నైరుతి రుతుపవనాల రాక మరింత ఆలస్యమవుతోంది. జూన్ 4, 5 తేదీల్లో ఈ రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. వాస్తవానికి మే 26వ తేదీనే నైరుతి రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకే అవకాశం ఉందని తొలుత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనా వేసింది. కానీ, ఈ సారి ఎల్‌నినో ప్రభావంతో ఆ అంచనాలు తలకిందులయ్యాయి. రుతుపవనాలు నెమ్మదిగా కదులుతుండటంతో వీటి రాక ఆలస్యమవుతోంది. కేరళను తాకిన రెండు, మూడు రోజుల తర్వాత అవి తెలంగాణలోకి ప్రవేశించే అవకాశం ఉంది. గతేడాది, అంచనా వేసిన సమయానికంటే ఎనిమిది రోజులు ముందుగానే మే 24న ఈ రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకాయి. ఆ తర్వాత మే 26న తెలంగాణలోకి ప్రవేశించాయి. ఇదిలా ఉండగా.. ఈ ఏడాది సాధారణం మిగతా 2లో..

## వేస్ట్ టు ఎనర్జీ' ప్లాంట్ల విస్తరణ

కొత్తగా మరో ఆరు ప్లాంట్ల ఏర్పాటు: పురపాలక మంత్రి నారాయణ వెల్లడి



**విజయవాడ, మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపాలిటీలను డంపింగ్ యార్డుల రహితంగా మార్చేందుకు కృషి చేస్తున్నామని మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. ప్రస్తుతం విశాఖపట్నం, గుంటూరులో 'వేస్ట్ టు ఎనర్జీ' ప్లాంట్లు ఉన్నాయని, కొత్తగా మరో ఆరు ప్లాంట్లను నెలకొల్పుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ లోగా 107 మున్సిపాలిటీల్లో ఉత్పత్తి అయ్యే చెత్త నిర్వహణ కోసం ఫ్రెష్ వేస్ట్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ ప్లాంట్ల ద్వారా ప్రతి రోజూ 5,385 టన్నుల చెత్తను కంపోస్ట్, బయోగ్యాస్‌గా మారుస్తామని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా కొండపల్లి, ఇబ్రహీంపట్నంలో మంత్రి నారాయణ, ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ పర్యటించారు. కొండపల్లిలో కొత్తగా నిర్మిస్తున్న ఫ్రెష్ వేస్ట్ ప్లాంట్‌ను పరిశీలించగా, ఇబ్రహీంపట్నంలో కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. 'ఏపీ ప్రజల నుంచి గత ప్రభుత్వం మిగతా 2లో..



## కాలుష్యరహితంగా గోదావరి పుష్కరాలు

- కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి
- స్వచ్ఛ గోదావరిపై జూన్ 25 నాటికి పూర్తిస్థాయి నివేదిక
- అధికారులను ఆదేశించిన డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్

**అమరావతి, మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** 'స్వచ్ఛ గోదావరి- పవిత్ర పుష్కరాల' నేపథ్యంలో అధికారులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కీలక ఆదేశాలు జారీ చేశారు. కాలుష్యరహిత గోదావరి పుష్కరాల నిర్వహణకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. నదిలోకి పారిశ్రామిక వ్యర్థాలు, మురుగు నీరు చేరకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని సూచించారు. దీని కోసం జూన్ 25 లోపు పూర్తి స్థాయి నివేదికతో 'స్వచ్ఛ గోదావరి' ప్రణాళికను సిద్ధం మిగతా 2లో..

## మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు.. ధైర్యంగా ప్రకటించిన పార్టీ తెదేపా


మంత్రి వంగలపూడి అనిత



**అమరావతి, మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ధైర్యంగా ప్రకటించిన పార్టీ తెదేపా అని మంత్రి వంగలపూడి అనిత అన్నారు. రిజర్వేషన్లపై చట్టం అమల్లోకి రాకపోయినా పార్టీ నిర్ణయం తీసుకుందని చెప్పారు. అమరావతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో అనిత మాట్లాడారు. "ఎన్టీఆర్ హయాంలో మహిళలకు ఆత్మగౌరవం.. చంద్రబాబు హయాంలో వారి ఆర్థిక గౌరవం పెరిగాయి. కోటి మంది మహిళలతో డ్వాక్రా సంఘాలు విరాజిల్లుతున్నాయి. మహిళలకు మిగతా 2లో..

## శ్రీవాణి టిక్కెట్లలో మార్పులు

1గంటలోపు బుక్ చేసుకున్న వారికి 4గంటలకు దర్శనం



**తిరుమల, మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** భక్తుల సౌకర్యార్థం శ్రీవాణి ట్రస్ట్‌కు సంబంధించిన దర్శన టికెట్ల కేటాయింపులో పలు మార్పులు చేసినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం టిటిడి తెలిపింది. శ్రీవాణజ టిక్కెట్లు నేరుగా బుక్ చేసుకున్న వారికి అదేరోజు సాయంత్రం దర్శనం మిగతా 2లో..

## సిద్ధరామయ్య రాజీనామా ఆమోదించిన గవర్నర్



**బెంగుళూరు, మే 29 (ఆర్ఎన్ఎ):** కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య రాజీనామాకు గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్ ఆమోదం తెలిపారు. సీఎం పదవికి సిద్ధరామయ్య నిన్న రాజీనామా చేసిన విషయం తెలిసిందే. గవర్నర్ మధ్యప్రదేశ్‌లో ఉండటంతో లోక్‌భవన్‌కు వెళ్లిన సిద్ధరామయ్య.. గవర్నర్ ప్రత్యేక కార్యదర్శి ప్రభుశంకర్‌కు రాజీనామాపత్రం సమర్పించారు. అర్ధరాత్రి మధ్యప్రదేశ్ నుంచి తిరిగి బెంగళూరు చేరుకున్న గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్ శుక్రవారం ఉదయం సిద్ధరామయ్య రాజీనామాను ఆమోదించారు. తదుపరి సీఎం ఎంపిక వరకు ఆపద్ధర్మ సీఎంగా ఆయనే కొనసాగనున్నారు. కర్ణాటక ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన సిద్ధరామయ్య పలువురు సీనియర్ నేతలతో కలిసి గురువారం సాయంత్రం ఢిల్లీ వెళ్లారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా కాంగ్రెస్ అగ్రనాయకులతో భేటీ కానున్నారు. కర్ణాటకలో తదుపరి ముఖ్యమంత్రి ఎంపిక, మంత్రివర్గ కూర్పుపై చర్చించే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.

## సెక్స్ వర్కర్లపై దాడులు సరికాదు

వారు కూడా మనుషులే అని గుర్తించాలి... లైంగిక వృత్తిలో ఉన్నవారికి ఆధార్ కార్డులు ఇవ్వాలి

సుప్రీం కోర్టు స్పష్టీకరణ



**న్యూఢిల్లీ, మే 29 (ఆర్ఎన్ఎ):** స్వచ్ఛందంగా ప్రాస్టిట్యూషన్‌ను ఎంచుకోవడం, మానవ అక్రమ రవాణా బారినపడి సెక్స్ వర్క్‌లోకి దిగడం మధ్య స్పష్టమైన తేడా ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇష్టపూర్వకంగా సెక్స్ వర్క్ చేసే వయోజనులను వేధించవద్దని పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. సెక్స్ వర్కర్లకు చట్టపరంగా సమాన రక్షణ ఉండాలని పేర్కొంది. దాడుల సమయంలో వారి గుర్తింపును వెల్లడించొద్దని మీడియాకు కూడా వార్నింగ్ ఇచ్చింది. దేశంలో మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు సమగ్ర మార్గదర్శకాలు జారీ చేసింది. స్వచ్ఛందంగా సెక్స్ వర్క్‌ను ఎంచుకున్న వారికి, మానవ అక్రమ రవాణా ముఠాల బారిన పడి ఈ రొంపిలో కూరుకుపోయిన బాధితులకు మధ్య తేడాను గుర్తించాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. సొంత ఇష్టంతో సెక్స్ వర్క్ నిర్వహించే వయోజనులపై దాడులు చేయడం, క్రిమినల్ కేసులు పెట్టడం చట్టవిరుద్ధమని పేర్కొంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం ప్రతి ఒక్కరికీ గౌరవంగా జీవించే హక్కు ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కేవలం లైంగిక వృత్తిలో తల్లి ఉందనే ఏకైక కారణంతో ఆమె నుంచి బిడ్డను బలవంతంగా వేరు చేయలేరని కూడా సుప్రీం కోర్టు పేర్కొంది. రెస్క్యూ ఆపరేషన్ల సమయంలో సెక్స్ వర్కర్ల ఫోటోలు, మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయిలు

# శ్రీవాణి టిక్కెట్లలో మార్పులు

కలగనుంది. ఈ టికెట్లు ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు విడుదల చేస్తారని.. మధ్యాహ్నం 1 గంటలోపు బుక్ చేసుకున్న భక్తులకు అదే రోజు సాయంత్రం 4 గంటలకు దర్శనానికి అనుమతించనున్నట్లు పేర్కొంది. కాగా ఈ విధానం జూన్ 10 నుంచి అమలులోకి రానుంది. ఈ కోటాలో బుకింగ్ కాని టికెట్లను తిరిగి కరెంట్ బుకింగ్ కోటాలో ఇస్తామని పేర్కొంది. ఈ విధానం 2027 మార్చి 31 వరకు అమల్లో ఉంటుందని తితిదే వెల్లడించింది. ప్రస్తుతం రోజుకు 1500 శ్రీవాణి టికెట్లను తితిదే ఆన్‌లైన్ ద్వారా అందుబాటులో ఉంచుతోంది. వీటిలో 500 దర్శన టికెట్లను మూడు నెలలు ముందుగానే ఆన్‌లైన్‌లో అడ్వాన్స్ బుకింగ్ కింద అందుబాటులోకి తీసుకొస్తోంది. మరో 200 శ్రీవాణి దర్శన టికెట్లను తిరుపతి విమానాశ్రయంలో కరెంట్ బుకింగ్ కింద జారీ చేస్తోంది. ప్రస్తుతం రోజువారీ కరెంట్ బుకింగ్ కోటాలో అందుబాటులో ఉన్న 800 దర్శన టికెట్లలో ఇప్పటికే రూ.10 వేలు విరాళం చెల్లించి దర్శన టికెట్ కోసం వేచి ఉన్న దాతలకు ప్రతిరోజూ 300 టికెట్లు ప్రత్యేకంగా కేటాయించాలని నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ఈ సదుపాయం 2025 మే 1 నుంచి విరాళం చెల్లించిన అర్హులైన దాతలకు వర్తించనుందని తితిదే తెలిపింది.

# మాజీమంత్రి గాదె వెంకటరెడ్డి కన్నుమూత

నుండి పోటీ చేసి తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచాడు. ఆ తరువాత 1972లో కాంగ్రెస్ అభ్యర్థిగా.. 1978లో జనతా పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి రెండు సార్లు మద్దుకూరి నారాయణ రావుపై ఓడిపోయారు. 1983, 1985,1989 ఎన్నికల్లో వరుసగా ఓటమి చవిచూశారు. తిరిగి 1991 ఉప ఎన్నికల్లో అలాగే 1994 సార్వత్రిక ఎన్నికల్లో పరుచూరు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. నేదురుమల్లి జనార్ధనరెడ్డి, కోట్ల విజయభాస్కరరెడ్డి మంత్రివర్గంలో మంత్రిగా పనిచేశాడు. 1999లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. 2004, 2009 అసెంబ్లీ ఎన్నికల్లో బాపట్ల నుంచి ఎమ్మెల్యేగా గెలిచి వైఎస్ రాజశేఖర్ రెడ్డి, కొణిజేటి రోశయ్య మంత్రివర్గంలో దేవాదాయ శాఖ మంత్రిగా పనిచేశాడు. ఆంధ్రప్రదేశ్ విభజన తరువాత జరిగిన 2014 ఎన్నికల్లో ఆయన పోటీ చేయలేదు. సుదీర్ఘకాలం పాటు కాంగ్రెస్?లో పని చేసిన ఆయన 2016 ఏప్రిల్ 29ను హస్తం పార్టీకి వీడ్కోలు పలికి టీడీపీలో చేరారు. నాలుగేండ్ల తర్వాత టీడీపీకి రిజైన్ చేసి 2020 మార్చి 16న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాడు. వయోభారం, అనారోగ్య సమస్యతలతో గత కొద్ది రోజులుగా ఆయన క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు.

# సెక్స్ వర్కర్లపై దాడులు సరికాదు

వీడియోలు ప్రసారం చేయడం నేరమని పేర్కొంది. నివాస ధ్రువీకరణ పత్రాలు లేకపోయినప్పటికీ సెక్స్ వర్కర్లందరికీ తక్షణమే ఆధార్ కార్డులు జారీ చేయాలని కూడా ఆదేశించింది. స్వచ్ఛందంగా ఈ మార్గాన్ని ఎంచుకున్న వారిని వదిలి, మహిళలు, మైనర్లను అక్రమ రవాణా చేసే మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని కూడా సుప్రీం కోర్టు ఆదేశించింది.

# 'నైరుతి' రాక మరింత ఆలస్యం

కన్నా తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ ఇప్పటికే ప్రకటించింది. ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో వర్షాలు తక్కువ పడొచ్చని పేర్కొంది. ఇక, జూన్‌లోనూ యూపీ, హరియాణా, పంజాబ్, బిహార్, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, గుజరాత్, ఛత్తీస్‌గఢ్‌లోని పలు ప్రాంతాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది.

# ఏపీ పీజీసెట్ ఫలితాలు విడుదల

జరిగిన ఈ పరీక్షల ఫలితాలను ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. ఈ పరీక్షకు మొత్తంగా 19,118మంది దరఖాస్తు చేసుకోగా.. 16,406 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 15,020 మంది (91.55 శాతం) ఉత్తీర్ణత సాధించినట్లు అధికారులు తెలిపారు. ఈ పరీక్షలో అర్హత సాధించిన వారికి రాష్ట్రంలోని 17 యూనివర్సిటీల్లో 30 సబ్జెక్టులకు పీజీ కోర్సుల్లో ప్రవేశాలను కల్పించనున్నారు. ఈ ఏడాది పరీక్షను తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ పరీక్షలో అర్హత సాధించిన అందరికీ మంత్రి లోకేశ్ అభినందనలు తెలిపారు. అద్భుతమైన ఉత్తీర్ణత శాతం విజేతల కృషి, పట్టుదలకు నిదర్శనమన్నారు. విజయం సాధించిన ప్రతి అభ్యర్థికీ ఉన్నత విద్య, పరిశోధన రంగాల్లో ఉజ్వల భవిష్యత్తు ఉండాలని ఈ సందర్భంగా ఆకాక్షించారు.

# మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు.. ధైర్యంగా ప్రకటించిన పార్టీ తెదేపా

33 శాతం రిజర్వేషన్ల అంశం 33 ఏళ్లుగా నానుతోంది. మహానాడును మహిళలకు అంకితం చేస్తున్నట్లుగా స్త్రీశక్తి థీమ్‌తో నిర్వహించారు. మహిళా రిజర్వేషన్లపై చట్టం అమల్లోకి రాకపోయినా పార్టీ నిర్ణయం తీసుకుంది" అని అనిత అన్నారు.

# అత్తను హత్య చేసిన కోడలు అరెస్ట్

**అనకాపల్లి, మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అనకాపల్లి జిల్లా చోడవరం మండలం వెంకన్నపాలెం గ్రామంలో అత్త పాసలమ్మను హత్య చేసిన కేసులో నిందితురాలైన కోడలు నాగమణిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు కేసుకు సంబంధించిన వివరాలను అనకాపల్లి ఏఎస్పీ శ్రావణి మీడియాకు వెల్లడించారు. నిందితురాలు వెంకన్న పాలెంలోని తన పుట్టింట్లో ఉండగా అరెస్ట్ చేసినట్లు చెప్పారు. నిందితురాలిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్పీ తెలిపారు. అత్తను కర్రతో తీవ్రంగా కొట్టి చంపినట్లు ఏఎస్పీ పేర్కొన్నారు.

# కాలుష్య రహితంగా గోదావరి పుష్కరాలు

(మొదటి పేజీ తరువాయి)

చేయాలని అధికారులను పవన్ ఆదేశించారు. గోదావరి పుష్కరాల నేపథ్యంలో ఆరు జిల్లాల పరిధిలో 262 పుష్కర పంచాయతీలను గుర్తించారు. వీటిని మురుగురహిత పంచాయతీలుగా తీర్చిదిద్దాలని, మురుగునీరు నేరుగా గోదావరిలో కలవకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. మురుగు నీటి నిర్వహణ, పారిశ్రామిక వ్యర్థాల కాలుష్యంపై పర్యవేక్షణ కోసం ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. పరిశ్రమల వ్యర్థాలు నదిలో కలవకుండా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు కఠినంగా వ్యవహరించాలని, మురుగు నీటిని శుద్ధి చేశాకే నదిలోకి వదలాలని పవన్ స్పష్టం చేశారు. మున్సిపాలిటీ సామర్థ్యానికి తగిన విధంగా మురుగు శుద్ధి ప్లాంట్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. పీసీబీ మంజూరు చేసిన రూ.100 కోట్ల నుంచి కూడా నిధుల వినియోగించాలని డిప్యూటీ సిఎం ఆదేశించారు. రోజువారీ 104 మిలియన్ లీటర్ల మురుగు నీరు జీవనదిని కలుషితం చేస్తోందన్నారు. ఇందులో గ్రామీణ ప్రాంతాల నుంచి 8.38 మిలియన్ లీటర్ల మురుగు నీరు గోదావరిలో కలుస్తోందని పేర్కొన్నారు. పారిశ్రామిక వ్యర్థాల్లో ఆంధ్ర పేపర్ మిల్లు వెదజల్లే రోజువారీ కాలుష్యమే 32 మిలియన్ లీటర్లు ఉంటుందన్నారు. నిత్యం గోదావరిలో కలిసే 13.24 మిలియన్ లీటర్ల ఆక్వా కాలుష్యం వీటికి అదనమని పేర్కొన్నారు. పారిశ్రామిక కాలుష్య నివారణకు నిరంతర తనిఖీలు చేయాలని సూచించారు. ఆర్టీజీఎస్ తరహా కంట్రోల్ రూం ద్వారా నిరంతరం ప్రత్యక్షంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణ టాస్క్ ఫోర్స్‌కి కంట్రోల్ రూం నిర్వహణ బాధ్యతలను అప్పగించారు.

# నీట్ పేపర్ లీక్ బాధ్యత ఎవరిది

(మొదటి పేజీ తరువాయి)

చెప్పారు. జూన్ 21న మరోసారి నిర్వహించే నీట్-యూజీ పరీక్ష కోసం కొత్త యంత్రాంగాలను ఏర్పాటు చేశామన్నారు. అయితే, ఈ వ్యవహారంపై ప్రతిస్పందన తెలియజేయాలని కేంద్రాన్ని ఆదేశించిన సుప్రీం ధర్మాసనం.. తదుపరి విచారణను జులై రెండో వారానికి వాయిదా వేసింది. నీట్ పేపర్ లీక్ ఉదంతంపై విచారణ చేపట్టిన సుప్రీం కోర్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీపై(ఎన్‌టీఏ) పలు ప్రశ్నలు సంధించింది. ఇన్ని నిఘా వ్యవస్థలు, కమిటీలు ఉన్నా పేపర్ ఎలా లీకైందని ప్రశ్నించింది. యూపీఎస్‌సీలో ఇలాంటి ఉదంతాలు ఎప్పుడూ వెలుగుచూడలేదని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. యూపీఎస్‌సీని చూసి నేర్చుకోవాలని ఎన్‌టీఏకు సూచించింది. నీట్ వ్యవస్థ ప్రక్షాళనకు కేంద్రం ఏర్పాటు చేసిన హైలెవెల్ కమిటీ చైర్మన్, ఇస్రో మాజీ చీఫ్ డా. రాధాకృష్ణన్ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్‌టీఏ, డా. రాధాకృష్ణన్ దాఖలు చేసిన అఫిడవిట్‌లను సర్వోన్నత న్యాయస్థానం పరిశీలించింది. కేంద్రం తన ఎఫిడవిట్ దాఖలు చేసేందుకు న్యాయస్థానం అదనపు గడువు ఇచ్చింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి జస్టిస్ నరసింహ మాట్లాడుతూ పేపర్ లీక్‌కు ఆస్కారం కల్పించిన పరిస్థితులు ఏమిటని డా. రాధాకృష్ణన్‌ను కోర్టు ప్రశ్నించారు. గతంలో అనేక రక్షణలను ఏర్పాటు చేసినా పేపర్ లీక్ ఎలా అయ్యిందని అన్నారు. ఇందుకు డా. రాధాకృష్ణన్ బదులిస్తూ పేపర్ సెట్టింగ్ ప్రక్రియలో సమస్య ఉందని అన్నారు. ప్రస్తుతం ఆ లోపాలను సరిదిద్ది వ్యవస్థను మరింత బలోపేతం చేశామని అన్నారు. పరీక్ష నిర్వహణలో ఎలాంటి సమస్య తలెత్తకుండా గతంలో మొత్తం 101 సూచనలు చేశామని చెప్పారు. వాటిల్లో 60 తాత్కాలిక సూచనలను 2025-26 పరీక్ష కోసం ప్రత్యేకంగా రూపొందించినట్టు చెప్పారు. ఇతర మార్గదర్శకాలు కూడా త్వరలో పూర్తిస్థాయిలో అమలవుతాయని చెప్పారు. మరోసారి ఇలాంటివి జరగవని ధీమా వ్యక్తం చేశారు. సంస్కరణలే తమ లక్ష్యమని పేర్కొన్నారు. కేవలం సంస్కరణలతో పరిస్థితి చక్కబడదని కోర్టు వ్యాఖ్యానించింది. తప్పు జరిగినప్పుడు బాధ్యత ఎవరిదనే దానిపై స్పష్టత ఉండాలని పేర్కొంది. బాధ్యత ఎవరు తీసుకుంటారనేది తేల్చకుండా ఎన్ని కమిటీలు, మీటింగ్‌లు ఏర్పాటు చేసిన ఫలితం ఉండదని వ్యాఖ్యానించింది. ఇక ఈ అంశంపై సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ పేపర్ లీక్‌పై విచారణ జరుగుతోందని అన్నారు. జూన్ 21 నాటి పరీక్ష నిర్వహణ కోసం కొత్త వ్యవస్థలను ఏర్పాటు చేశామని అన్నారు. ప్రభుత్వం ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుందని చెప్పారు. ప్రధాని స్వయంగా ఈ అంశాన్ని పర్యవేక్షిస్తున్నారని కోర్టుకు తెలిపారు.

# వేస్ట్ టు ఎనర్జీ' ప్లాంట్ల విస్తరణ


(మొదటి పేజీ తరువాయి)

చెత్త పన్ను వసూలు చేసింది. అయినా 150 లక్షల టన్నుల చెత్తను వదిలి వెళ్లిపోయింది. ఆ చెత్తను కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తొలగిస్తున్నాం. వచ్చే నెలాఖరు నాటికి అన్ని ప్లాంట్లు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తాం. ఐదు కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ల కోసం ఏపీ ప్రభుత్వం రూ.59.85 కోట్లు మంజూరు చేసింది. రాజమహేంద్రవరం, నెల్లూరు, గుంటూరు, ఒంగోలు, ఇబ్రహీంపట్నంలో నూతన సీబీజీ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నాం. విజయవాడలో ఉన్న ప్లాంట్‌ను కూటమి ప్రభుత్వం రూ.9.45 కోట్లతో ఉన్నతీకరిస్తోంది. మొత్తం ఐదు ప్లాంట్ల ప్రాసెసింగ్ సామర్థ్యం రోజుకు 125 టన్నులు. ప్రతి యూనిట్‌ను రోజుకు 25 టన్నుల సామర్థ్యంతో రూపకల్పన చేశాం. ఒక్కో నూతన ప్లాంట్‌కు రూ.12.60 కోట్ల వ్యయం అవుతుందని అంచనా. ఇందుకు కేంద్రం, రాష్ట్రం, పట్టణ స్థానిక సంస్థలు, ప్రైవేట్ డెవలపర్లు నిధులు సమకూర్చనున్నారు. పురపాలక వ్యర్థాలను స్వచ్ఛమైన శక్తిగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యం. పట్టణ వ్యర్థాల నిర్వహణలో విప్లవాత్మక మార్పు తీసుకొస్తాం. సుస్థిర వ్యర్థాల నిర్వహణ, స్వచ్ఛమైన ఇంధన ఉత్పత్తి దిశగా కీలక అడుగు వేశాం. డంపింగ్ యార్డుల భారాన్ని తగ్గించేందుకు సీబీజీ ప్లాంట్లు దోహదపడతాయి. పట్టణ ఇంధన భద్రతను బలోపేతం చేసే ప్రాజెక్టుగా సీబీజీ ప్లాంట్లు ఉపయోగపడతాయి. దీర్ఘకాలిక పర్యావరణ, ఆర్థిక సుస్థిరతకు ఈ ప్రాజెక్ట్ భరోసా ఇస్తుంది. స్వచ్ఛాంధ్ర లక్ష్య సాధనలో భాగంగా సీబీజీ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నాం. వ్యర్థాల నుంచి సంపద సృష్టించడమే కూటమి ప్రభుత్వ విధానం' అని మంత్రి పేర్కొన్నారు.

# రెండ్రోజుల మహానాడు దిగ్విజయం

**స్త్రీ శక్తి థీమ్‌కు అర్థం చెప్పేలా 33 శాతం రిజర్వేషన్లు... విజయవంత చేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేనా కృతజ్ఞతలు**

**మహానాడు విజయవంతంపై మీడియాతో మంత్రి లోకేశ్**



**అమరావతి, మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తెలుగుదేశం పార్టీ రెండు రోజుల పాటు నిర్వహించిన మహానాడు 2026 విజయవంతంగా పూర్తయింది. ఈ నేపథ్యంలో ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి నారా లోకేశ్ శుక్రవారం స్పందించారు. మహానాడు 2026 విజయవంతం కావడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని తెలిపారు. స్త్రీ శక్తి థీమ్‌కు అసలైన అర్థం చెప్పేలా మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చేసిన తీర్మానానికి అందరి ఆమోదం లభించడం.. ఇది దేశవ్యాప్తంగా చర్చనీయాంశం కావడం ఈ మహానాడు సాధించిన మరో గొప్ప విజయం అని మంత్రి నారా లోకేశ్ అభివర్ణించారు. కార్యకర్తలే అధినేత నినాదాన్ని పార్టీ జాతీయ అధినేత అమలు చేసిన ఈ మహానాడు చరిత్రలో నిలిచిపోతుందన్నారు. రెండు రోజుల మహానాడుకు ఒక్క మైటీడీపీ యాప్‌లో 24.50 లక్షల డిజిటల్ అటెండెన్స్ నమోదు కావడం మరో రికార్డు అని తెలిపారు. తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు, మహానాడు కమిటీలు, పార్టీ కార్యాలయ యంత్రాంగం, బ్యాక్ ఆఫీస్, సాంకేతిక సిబ్బంది, ఓజిఆఖ, ఎ÷ుఆఖ, అనుబంధ సంఘాలు, మీడియా మిత్రులు, సోషల్ మీడియా అభిమానులు, ఎన్ఆర్ఐలు, మిత్రపక్షాలు, ప్రజలు, భద్రతా సిబ్బంది అందరికీ కృతజ్ఞతాభి వందనాలు తెలిపారు. మహానాడు 2026 విజయం మీ అందరికీ అంకితం చేస్తున్నానని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. ఇది మీ విజయం అని మంత్రి లోకేశ్ వెల్లడించారు. మీ కృషికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని చెప్పారు. తెలుగుదేశం పార్టీ కోట్లాది కుటుంబసభ్యుల ఆశీస్సులతో తాను టీడీపీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఎంపికైన తర్వాత జరిగిన తొలి మహానాడు ఇదని ఆయన వివరించారు. ఈ మహానాడు ఘన విజయం టీడీపీ టీం కృషి అని స్పష్టం చేశారు. సమష్టిగా పనిచేస్తే ఎన్ని అద్భుతాలు చేయగలమో టీడీపీ కుటుంబం నిరూపించిందని పేర్కొన్నారు. అంతర్జాతీయ ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో గౌరవ ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపుతో నెల్లూరులో జరగాల్సిన మహానాడు 2026ను అందరి ఆమోదంతో హైబ్రిడ్ విధానంలోకి మార్చామని మంత్రి లోకేశ్ గుర్తు చేశారు. తెలుగుదేశం రాజకీయ పాఠశాలలో గురువు చంద్రబాబు నాయుడు సంక్షోభాలను అవకాశాలుగా మలచుకోవడం మనకు నేర్పారని చెప్పారు. ఆ నేర్పును ఇంటర్నేషనల్ క్రైసిస్‌లో కూడా ఎవరూ ఊహించని విధంగా హైబ్రిడ్ మహానాడును ఒక అవకాశంగా తీసుకుని విజయవంతం చేశారని సంతోషం వ్యక్తం చేశారు. గతంలో మాదిరి ఒకచోట జరిగే మహానాడుకు తెలుగు రాష్ట్రాల నుంచి టీడీపీ కుటుంబసభ్యులు తరలివచ్చేవారని పేర్కొన్నారు. తెలుగుదేశం నా బాధ్యత అంటూ ఇప్పుడూ ప్రతి పల్లె, ప్రతి ఇల్లూ మహానాడుకు వేదిక అయి.. పసుపు జెండాలతో రెపరెపలాడిందన్నారు. కార్యకర్తలే అధినేతలై.. నేతలే మార్గదర్శులై రాష్ట్రవ్యాప్తంగా 1875 క్లస్టర్ల బాధ్యతలను తామే తీసుకుని మహానాడు 2026ను కనివినీ ఎరుగనీ రీతిలో విజయవంతం చేశారని చెప్పారు.

# ఎట్టకేలకు వట్టిచెరుకూరు గ్రామ సమస్యకు పరిష్కారం

**మంత్రి అనగాని ప్రసాద్ చొరవతో దక్కిన ఊరట**

**అమరావతి, మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** గుంటూరు జిల్లాలోని వట్టిచెరుకూరు గ్రామ సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. ఏపీ రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ చొరవతో 120 ఏళ్లుగా కొనసాగుతున్న సమస్యకు చెక్ పెట్టారు. సిఎం చంద్రబాబు ఆదేశాల మేరకు అధికారులు సమగ్రంగా పరిశీలించి, శతాబ్ద కాలంగా 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న గ్రామాన్ని ఆ జాబితా నుంచి తొలగించేందుకు చర్యలు చేపట్టారు. దీంతో గ్రామంలోని 515 కుటుంబాలకు భారీ ఊరట లభించింది. వివరాల్లోకి వెళితే.. క్రీ.శ.1134 నుంచే వట్టిచెరుకూరు గ్రామం ఉనికిలో ఉన్నట్లు వెల్లడైంది. 1931 నుంచే ఈ ఊరు గ్రామపంచాయతీగా కొనసాగుతూ వస్తోంది. గ్రామస్థులు అప్పటి నుంచే పన్నులు చెల్లిస్తున్నప్పటికీ, 2006లో జరిగిన ఆర్ఎస్ఆర్ నమోదులో పొరపాటున గ్రామాన్ని 'ఊరి ముందరి చెరువు'గా పేర్కొన్నారు. అనంతరం 2008లో రిజిస్ట్రేషన్ చట్టంలోని 22ఏ(1)(బి) కింద మొత్తం గ్రామాన్ని నిషేధిత జాబితాలో చేర్చారు. దీంతో గ్రామస్థులు తమ భూములను కొనుగోలు, విక్రయాలు చేయలేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామస్థుల వినతిపై స్పందించిన మంత్రి అనగాని సత్యప్రసాద్, సమస్యను ప్రత్యేకంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో గ్రామాన్ని పొరపాటున ఊరి ముందరి చెరువుగా నమోదు చేసినట్లు తేలింది. ప్రస్తుతం అక్కడ ఎలాంటి నీటి వనరులు లేవని నివేదికలో స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో గ్రామ విస్తీర్ణంలో ఉన్న 25.37 ఎకరాలను గ్రామకంఠంగా ప్రకటిస్తూ, నిషేధిత జాబితా నుంచి తొలగించాలని రెవెన్యూ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ.. 'ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న అనేక రెవెన్యూ సమస్యలను ప్రభుత్వం దశలవారీగా పరిష్కరిస్తోంది.

# హాస్టల్ భవనం నిర్మాణానికి వినతి

**ప్రభుత్వం దృష్టి కి తీసుకు వెళ్తానని ఎంపీ సానా సతీష్ బాబు హామీ**



**కాకినాడ, మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** విజయవాడ తూర్పు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ సూచన మేరకు వ రాయల్ సర్వీస్ ట్రస్ట్ నున్న గ్రామ పరిధిలో గ్రామీణ ప్రాంత పేద, మధ్యతరగతి విద్యార్థుల కోసం ప్రతిపాదించిన హాస్టల్ భవన నిర్మాణానికి అనుమతులు మంజూరు చేసేలా ప్రభుత్వానికి సిఫార్సు చేయవలసిందిగా కోరుతూఎంపీ సానా సతీష్ బాబు కు వినతిపత్రం సమర్పించారు. శుక్రవారం ఎంపీ నీ కలిసి సమస్య పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పేద విద్యార్థులకు విద్యా, వసతి సౌకర్యాలు కల్పిస్తూ సేవలందిస్తున్న ట్రస్ట్ సభ్యుల సేవలను ఎంపీ సతీష్ బాబు అభినందించారు. వారి వినతిపై సానుకూలంగా స్పందించి, తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర శాసన సభ మాజీ ఉప సభాపతి బూరగడ్డ వేదవ్యాస్ మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ,ట్రస్ట్ సభ్యులు పెటేటి పుల్లయ్య , సీతాళం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు 33% రిజర్వేషన్ పట్ల హర్షం



**కాకినాడ, మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మహిళలకు 33శాతం రాజకీయ రిజర్వేషన్లు ప్రకటించడం పట్ల తెలుగు మహిళలు హర్షం వ్యక్తం చేశారు. కాకినాడజిల్లా తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో టీడీపీలో మహిళలకు 33% సీట్లు కేటాయిస్తామని ప్రకటించిన జాతీయ అధ్యక్షుడు, మంత్రి నారా లోకేష్ కి కృతజ్ఞతలు తెలుపుతూ, జిల్లా మహిళా నేతల ఆధ్వర్యంలో "థాంక్యూ లోకేష్ అన్నా" కార్యక్రమం నిర్వహిశీచారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో అనాదిగా మహిళలకు ఎప్పుడూ సముచిత స్థానం కల్పించబడినదని, రాజకీయాల్లో కూడా 33శాతం అమలు చేయాలని మహానాడు తీర్మానించిందని హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, అధికార ప్రతినిధి సుంకర పావని తిరుమల కుమార్, కలగా శివరాణి,అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# పోలవరం అడవుల్లో పులి సంచారం

**అధికారులను అప్రమత్తం చేసిన పవన్**

**అమరావతి, మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పోలవరం అడవుల్లో పులి సంచారం నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. తిమ్మాపురం రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో పులి కదలికలు గుర్తించిన అధికారులు, పులి సమీప గ్రామాల వైపు సంచరిస్తోందని వెల్లడించారు. ఈ విషయంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. పులి కదలికలను నిరంతరం పర్యవేక్షించాలని, అవసరమైతే హనుమాన్ ప్రత్యేక బృందాలను రంగంలోకి దించాలని అధికారులను ఆదేశించారు. మనుషులు, పశువుల ప్రాణాలకు ఎలాంటి హాని కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని అటవీ శాఖకు స్పష్టం చేశారు. అవసరమైతే అదనపు హనుమాన్ బృందాలను పంపాలని కూడా సూచించారు. చికిలింత పంచాయతీ పరిధిలోని ఒక పశువుల పాకపై పులి దాడి చేయగా, ఈ ఘటనలో 9 దూడలు మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. అలాగే అడవికి సుమారు 300 మీటర్ల దూరంలో ఉన్న ఆయిల్ ఫామ్ తోటలో కూడా పశువులపై దాడి జరిగినట్లు వెల్లడించారు. పులి సంచారంపై ఆధునిక సాంకేతికతతో నిఘా ఏర్పాటు చేయాలని పవన్ కల్యాణ్ సూచించారు. అటవీ సరిహద్దు గ్రామాల్లో నిరంతర అప్రమత్తత కొనసాగించాలని, ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని ఆదేశించారు. మొత్తం ఆపరేషన్‌పై స్వయంగా పర్యవేక్షణ చేయాలని, అవసరమైతే కేంద్ర కార్యాలయం నుంచి సీనియర్ అధికారిని ఘటనాస్థలికి పంపాలని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. వన్యప్రాణి సంరక్షణ నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. పులి సంచారం ఉన్న గ్రామాల్లో అవగాహన శిబిరాలు నిర్వహించాలని, ప్రజలు అనవసరంగా అడవుల్లోకి వెళ్లకూడదని హెచ్చరించాలని అధికారులను ఆదేశించారు. అలాగే పశువులను అడవి సమీపంలో కట్టివేయకుండా రైతులకు సూచనలు ఇవ్వాలని చెప్పారు. బాధిత రైతులకు తక్షణ పరిహారం అందించామని, త్వరలో పూర్తి పరిహారం చెల్లిస్తామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెల్లడించారు.

# గాలివాన బీభత్సం..

**విద్యుత్ సరఫరా పునరుద్ధరణపై మంత్రి సమీక్ష**

**అమరావతి, మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాత్రి నుంచి పలుచోట్ల వర్షం, ఈదురుగాలుల వల్ల వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలు తలెత్తాయని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ఉమ్మడి కృష్ణా, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో కొన్నిచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిందన్నారు. వర్షం కారణంగా కొన్నిచోట్ల విద్యుత్ పునరుద్ధరణకు ఆలస్యమవుతోందన్నారు. మధ్యాహ్నంలోగా విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు అధికారులను మంత్రి గొట్టిపాటి ఆదేశించారు. ఏ పనికి ఎంత సమయం పడుతుందో పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. ప్రజలు విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా అప్రమత్తత సందేశాలు పంపాలని ఆదేశించారు. ప్రజలకు ఏ సమస్య ఉన్నా 1912 టోల్‌ఫ్రీ నెంబర్‌ను సంప్రదించవచ్చని సూచించారు. విజయవాడలో విద్యుత్ తీగ తెగిపడి హోంగార్డు మృతి చెందడం పట్ల మంత్రి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. హోంగార్డు కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఉభయగోదావరి జిల్లాల్లో ఒకటి, రెండు గ్రామాలు మినహా విద్యుత్ సరఫరా పునరుద్ధరించామని అధికారులు మంత్రికి వివరించారు. మిగిలిన ప్రాంతాల్లో మధ్యాహ్నంలోపు పునరుద్ధరిస్తామని అధికారులు తెలిపారు.

## నేటి మనదేశమ్ సంపాదకీయం

# కాలంతో పోరాడలేక చతికిల పడ్డ కమ్యూనిస్టులు

కేరళ సిఎంగా ఉండగానే పినరయ్ విజయ్‌పై ఆరోపణలు వచ్చాయి. కూతురికి లబ్ది చేకూర్చేందుకు ప్రభుత్వ ధనం దుర్వినియోగం చేశారన్న అభియోగాలు వచ్చాయి. ఇందులో ఆనాటి నుంచే కేసు నడుస్తోంది. తాజాగా ఇప్పుడు ఇడి రంగంలోకి దిగడంతో ఇది కాంగ్రెస్, బిజెపిల కుట్ర అని, లెఫ్ట్ పార్టీని దెబ్బతీసే కుయుక్తి అంటూ విమర్శలు చేస్తున్నారు. చాలా విచిత్రంగా ఈ రెండు పార్టీలు కలుస్తాయా అన్నది కమ్యూనిస్టులే చెప్పాలి. మరో విషయమేమంటే ఎన్నికల సందర్భంగా రాహుల్ తన ప్రచారంలో బిజెపి లెఫ్ట్‌తో కుమ్మక్కయిందని ఆరోపించారు. కాంగ్రెస్‌- బిజెపి రెండూ కూడబలుక్కొని కేరళంలో సిపిఎం ప్రతిష్టను దెబ్బతీయటానికి బరి తెగించాయని విమర్శలు చేస్తున్నారు. ఎన్నికలకు ముందు ఇడి నోటీసులు ఇవ్వటంతో వ్యవహారం మొదలైంది. దేశంలో ప్రతిపక్ష పార్టీలపైనా, నాయకులపైనా అవినీతి ఆరోపణలు గుప్పించడం, ఆ తరువాత తన గుప్పిట్లో పెట్టుకున్న దర్యాప్తు సంస్థల చేత దాడులు చేయించడం కేంద్రంలోని మోడీ-షా ప్రభుత్వం చాలాకాలంగా అనుసరిస్తున్న విధానం అని దాదాపు అన్ని పార్టీలు చేస్తున్న ఆరోపణలే. ఢిల్లీలో అరవింద్ కేజ్రీవాల్, జార్ఖండ్‌లో హేమంత్ సోరెన్‌ల మీద సాగించిన దాష్టీకం, ఇందులో భాగమని సిపిఎం ఆరోపణ. అవినీతి పంకిలం అంటించి రాజకీయ లబ్ది పొందాలనే బిజెపి కుట్రపూరిత వ్యూహం అత్యంత దిగజారుడుతనానికి నిదర్శనంగా ఇప్పుడు సిపిఎం ఆరోపిస్తోంది. కేరళంలో అధికారం కోల్పోయాక సిపిఎం బహుశా కనుమరుగైనట్లుగానే భావించాలి. కేరళంలో కొంత మిణుకుమిణుకుమంటున్నా,దేశంలోని అనేక రాష్ట్రాల్లో అసలు ఉనికి లేకుండా పోయింది. ముఖ్యంగా కమ్యూనిస్టులు నేలవిడిచి సాము చేయడం, పడికట్టు సిద్దాంతాల నుంచి బయటపడక పోవడం, గతంలో లాగా పోరాటలకు దూరంగా ఉండడం వంటివన్నీ వారిని తుడిచిపెట్టేలా చేశాయి. కేరళంలో విజయన్ కుమార్తె నిర్వహణలోని సంస్థ అందించిన సేవల నిమిత్తం పొందిన ప్రతిఫలాన్ని వివాదాస్పదం చేసి, మనీ లాండరింగ్ సెక్షన్లు బనాయించిందన్నది సిపిఎం ఆరోపణగా ఉంది. రాహుల్ గాంధీ ఇంకో రెండడుగులు ముందుకేసి, పినరయి విజయన్‌ను ఎందుకు అరెస్టు చేయరంటూ ప్రశ్నించాడట. కేరళంలో అధికారంలోకి వచ్చిన మరు క్షణం నుంచి ఒకపక్క కాంగ్రెస్, మరోపక్క సంఘ్ పరివార్ శక్తులూ సిపిఎంపై దాడులకు తెగబడుతున్నాయన్న వాదనను సిపిఎం తెరపైకి తెచ్చింది. విజయన్ ఇంటిపై కుట్రపూరిత దాడుల గురించి తెలిసిన వెంటనే దేశమంతా వెల్లువెత్తిన నిరసనలే ఎర్రజెండా పట్ల ప్రజల నమ్మకానికి నిదర్శనం అంటోంది. నిజానికి ఈ కేసు చాలా చిన్నది. దీనిని కోర్టులో తేల్చుకోవచ్చు. కానీ అలా చేయడం లేదు. లెఫ్ట్ రాజకీయాలకు వస్తే బెంగాల్లో 35 ఏళ్లపాటు అధికారంలో ఉండి చేసిందేమీ లేదు. కేరళలోనూ ప ఎద్దగా అభివృద్ధి జరిగిన దాఖలాలు లేవు. తరిపురలోనూ అలాగే చేశారు. అందుకే ప్రజలు వీరిని ఇంటికి పంపించారు. ఈ దెబ్బతో దేశంలో ఇక లెఫ్ట్ పార్టీలకు కాలం చెల్లినట్లే. అభివృద్ధి చెందిన దేశాల్లో, అంటే సంపన్న, వలసవాద, పారిశ్రామిక దేశాల్లో కమ్యూనిస్టు భావజాలం అంతగా విస్తరించలేకపోయింది. వలస విముక్తి ఉద్యమాలు జోరందుకున్న లేదా నవస్వతంత్ర దేశా ల్లో మాత్రం దండిగా మార్మోగింది. అలాంటి దేశాల్లో భారత్ మొదటి వరుసలో ఉంటుంది. సాంప్రదాయిక భావజాల ప్రతినిధి అయిన ఆర్‌ఎస్‌ఎస్ ఆవిర్భవించిన 1925లోనే కమ్యూనిస్టు పార్టీ ఊపిరిపోసుకుంది. ఆర్‌ఎస్‌ఎస్ కుటుంబానికి చెందిన బీజేపీ తన అధికారాన్ని పటిష్టపరచుకుంటున్న తరుణంలో కమ్యూనిస్టులు కనుమరుగైపోతుండటం ఓ వైచిత్రి. రాజ్యాంగం అమలులోకి వచ్చిన తర్వాత 1951 -52 నాటి తొలి ఎన్నికల్లో వారు గణనీయమైన విజయాలు సాధించారు. నల్గొండ నుంచి కమ్యూనిస్టు నేత రావి నారాయణరెడ్డి, తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూను మించిన మెజారిటీ సాధించడం గురించి అప్పట్లో గొప్ప గా చెప్పుకొన్నారు. తాజాగా ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత దేశంలో కమ్యూనిస్టుల పలుకుబడి అడుగంటిన సూచనలు కనిపిస్తు న్నాయి. సు మారు 50 ఏండ్లలో ఏ రాష్ట్రంలోనూ కమ్యూనిస్టు ప్రభుత్వం లేని పరిస్థితి వచ్చింది. కేరళలో పినరయి విజయన్ ప్రభుత్వ ఓటమి కీలక పరిణామమే. దీంతో దేశ రాజకీయాల్లో కమ్యూనిస్టుల శకం అంతరించినట్టేననే వ్యాఖ్యానాలు వినిపిస్తుండటం గమనార్హం. ఒకప్పుడు కమ్యూనిస్టులు ప్రజల కోసం ఉద్యమాలు చేసేవారు. ఇప్పుడా పరిస్థితులు లేకుండ పోయాయి. కేరళ తర్వాత బెంగాల్, త్రిపుర ఇలా మొత్తం మూడు రాష్ట్రాల్లో వామపక్ష ప్రభుత్వాలు సుదీర్ఘకాలం కొనసాగాయి. కానీ ఇప్పుడదంతా గత వైభ వం. మారిన పరిస్థితుల్లో దానిని తిరిగి రాబట్టుకోవడం అంత సులభం కాదని మాత్రం చెప్పవచ్చు. కేంద్రంలో కాంగ్రెస్ ఆధిపత్యం వీగిపోయి, సంకీర్ణ ప్రభుత్వాల కాలంలో కమ్యూనిస్టులు హస్తినలో మంత్రి పదవులూ చేపట్టారు. ఓ దశలో కమ్యూనిస్టు సీనియర్ నేత జ్యోతిబసును ప్రధాని పదవి చేపట్టే అవకాశమూ తలుపు తట్టింది. అంతటి ఉన్నతస్థితి నుంచి, నేడు ఏమాత్రం ప్రాముఖ్యం లేని స్థాయికి కమ్యూనిస్టులు పడిపోయారు. కేరళంలో తమను ఓడించిన కాంగ్రెస్‌తో తెలంగాణలో అంటకాగడం, ఒకటి రెండు స్థానాల కోసం వెంపర్లాడటం వారి దైన్యాన్ని కండ్లకు కడుతున్నది. భారత్‌లో పార్లమెంటరీ పంథాలో వెళ్లిన కమ్యూనిస్టులు కనుమరుగవుతుంటే, మరోవైపు సాయుధ పోరాటాన్ని ఎంచుకున్న కమ్యూనిస్టులు కగార్ ధాటికి నేలకొరుగుతున్నారు. కమ్యూనిస్టుల 'చారిత్రిక తప్పిదాలు', ప్రజల్లో పెరిగిన వినిమయతత్వం అందుకు దారితీశాయి అనేది అక్షరసత్యం. ప్రజలిప్పుడు డబ్బు సంపాదించటం, ఖర్చు పెట్టటం గురించి తప్ప విప్లవాలు, ఉద్యమాల గురించి ఎక్కువగా ఆలోచించటం లేదు. కాలం చెల్లిన వ్యూహాలు, ఎత్తుగడలూ కమ్యూనిస్టుల మహాప్రస్థానానికి బ్రేకులు వేశాయి. మొత్తంగా ఇప్పుడు కమ్యూనిస్టుల భవిష్యత్ ఏంటన్నది కాలమే చెప్పాలి. పినరయ్ విజయ్ లాంటి వారు కూతురుకు మేలు చేయడం కోసం అవినీతి బురద తొక్కడం కూడా కాల వైచిత్రమే.

## ప్రజా పక్షం వహించిన గొప్ప నేత ఎన్టీఆర్

**ఎన్టీఆర్ స్ఫూర్తితోనే అన్న క్యాంటీన్లు**
**ఎన్టీఆర్ కు పవన్ కల్యాణ్ ఘన నివాళి**

**అమరావతి,మే29(ఆర్ఎన్ఎ):** దివంగత మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) జయంతి సందర్భంగా జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. కథానాయకుడిగా ప్రేక్షకుల నీరాజనాలు అందుకుని, ఆ తర్వాత రాజకీయాల్లోకి వచ్చి ప్రజా పక్షాన నిలిచిన గొప్ప నేత ఎన్టీఆర్ అని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ అందించిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. పేదల ఆకలి తీర్చే లక్ష్యంతో ఆయన ప్రవేశపెట్టిన 'రెండు రూపాయలకే కిలో బియ్యం' పథకం చారిత్రాత్మకమైనదని గుర్తుచేశారు. ఎన్టీఆర్ చూపిన అదే స్ఫూర్తితో ప్రస్తుత కూటమి ప్రభుత్వం 'అన్న క్యాంటీన్ల'ను నిర్వహిస్తోందని పవన్ కల్యాణ్ తెలిపారు.

# హార్మ్యూజ్ జలసంధి ఎవరి సొత్తు కాదు

**చర్చలు విఫలమైతే వెనక్కి తగ్గబోం... అవసరమైతే రక్షణ మంత్రిని రంగంలోకి... ఇరాన్ అణ్వాయుధాలు సంపాదించకూడదు**
**ప్రపంచ భద్రత కోసం ప్రయత్నిస్తున్నాం... అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్ర వ్యాఖ్యలు**

**మాస్కో,మే29(ఆర్ఎన్ఎ):** ఇరాన్‌తో శాంతి చర్చలు కొనసాగిస్తున్నామని చెబుతూనే మరోవైపు అమెరికా సైనిక చర్యలకు దిగుతోంది. పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న వేళ హార్మ్యూజ్ జలసంధి సమీపంలోని ఇరాన్ మిలిటరీ స్థావరాలను లక్ష్యంగా చేసుకుని అమెరికా వైమానిక దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో పలు ఇరాన్ డ్రోన్లను కూల్చివేసినట్లు అమెరికా రక్షణశాఖ వెల్లడించింది. హార్మ్యూజ్ ప్రాంతంలో తమ సైన్యానికి ముప్పు పెరుగుతోందని, అందుకే ముందస్తు చర్యగా ఈ దాడులు చేపట్టామని అధికారులు తెలిపారు. ఇక ఇరాన్‌తో జరుగుతున్న శాంతి చర్చలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. చర్చలు విఫలమైతే తాము వెనక్కి తగ్గబోమని, అవసరమైతే రక్షణ మంత్రిని రంగంలోకి దించి పని పూర్తిచేస్తామంటూ హెచ్చరించారు. అమెరికాలో మధ్యంతర ఎన్నికలు ఉన్నాయని ఇరాన్ భావిస్తోందని, కానీ తాను ఎన్నికలను పట్టించుకోనని ట్రంప్ వ్యాఖ్యానించారు. "ఇరాన్ అణ్వాయుధాలు సంపాదించకూడదు. అది కేవలం అమెరికా కోసమే కాదు. ప్రపంచ భద్రత కోసం చేస్తున్న పని అని ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్ నాయకత్వం అమెరికాతో ఒప్పందం చేసుకోవాలని కోరుకుంటోందని, కానీ ఇప్పటివరకు సరైన పురోగతి కనిపించలేదన్నారు. "ఇప్పటివరకు మేము సంతృప్తిగా లేం. కానీ చివరికి అవుతాం" అని ఆయన వ్యాఖ్యానించారు. హార్మ్యూజ్ జలసంధిపై కూడా ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ప్రాంతం అంతర్జాతీయ జలమార్గమని, దీనిని ఏ దేశం నియంత్రించలేదని అన్నారు. "హార్మ్యూజ్ అందరికీ తెరిచి ఉంటుంది. మేము పర్యవేక్షిస్తాం కానీ దానిపై ఎవరికీ పూర్తి నియంత్రణ ఉండదు" అని తెలిపారు.



ఇదే అంశం ప్రస్తుతం జరుగుతున్న చర్చల్లో భాగమని వెల్లడించారు. అంతేకాదు ఒమన్‌కు కూడా ట్రంప్ హెచ్చరికలు జారీ చేశారు. హార్మ్యూజ్ చర్చల్లో ఒమన్ జోక్యం చేసుకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని అన్నారు. "ప్రపంచంలోని మిగతా దేశాల్లాగే ఒమన్ కూడా ప్రవర్తించాలి. లేకపోతే మేం చర్యలు తీసుకోవాల్సి వస్తుంది" అని ఘాటుగా స్పందించారు. ఇదిలా ఉంటే, ఇరాన్ ప్రభుత్వ మీడియా ఓ సంచలన కథనాన్ని ప్రసారం చేసింది. అమెరికా, ఇరాన్ మధ్య తాత్కాలిక అవగాహన ఒప్పందం కుదిరిందని, యుద్ధ పరిస్థితులను తగ్గించే దిశగా రెండు దేశాలు ముందడుగు వేసాయని పేర్కొంది. ఈ ఒప్పందం ప్రకారం అమెరికా తన నౌకాదళ దిగ్బంధాన్ని ఎత్తివేయాలని, గల్ఫ్ ప్రాంతం నుంచి సైనిక బలగాలను వెనక్కి తీసుకోవాలని కథనంలో పేర్కొన్నారు. అలాగే హార్మ్యూజ్ జలసంధిలో వాణిజ్య నౌకల రాకపోకలు 30 రోజుల్లో సాధారణ స్థితికి చేరుకుంటాయని ఇరాన్ మీడియా వెల్లడించింది. ఈ ప్రాంతంలో వాణిజ్య నౌకల పర్యవేక్షణను ఇరాన్, ఒమన్ సమన్వయంతో నిర్వహిస్తాయని కూడా పేర్కొంది. అయితే ఈ వార్తలను అమెరికా వైట్ హౌస్ పూర్తిగా ఖండించింది. "ఇరాన్ ప్రభుత్వ నియంత్రణలో ఉన్న మీడియా ప్రచారం చేస్తున్న కథనాలు పూర్తిగా అబద్ధాలు. వారు విడుదల చేశామంటున్న అవగాహన ఒప్పందం పూర్తిగా కల్పితం అని వైట్ హౌస్ ఎక్స్ వేదికగా ప్రకటించింది. ఇరాన్ మీడియా కథనాలను ఎవరూ నమ్మవద్దని స్పష్టం చేసింది. మరోవైపు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కూడా ఈ అంశంపై స్పందించారు. అమెరికా ఇప్పటికీ దౌత్య మార్గానికే ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. "దౌత్య చర్చలే ఎప్పుడూ మొదటి ఎంపిక. ఒప్పందం కుదిరే అవకాశం ఉంటే మేము సిద్ధంగా ఉన్నాం" అని అన్నారు. ఇటీవల కొన్ని చర్చల్లో పురోగతి కనిపించిందని, రాబోయే గంటలు, రోజుల్లో పరిస్థితి మరింత స్పష్టమవుతుందని తెలిపారు. అయితే చర్చలు విఫలమైతే అమెరికాకు ఇతర ప్రత్యామ్నాయాలు కూడా ఉన్నాయని రూబియో హెచ్చరించారు. అమెరికా భద్రతా ప్రయోజనాల విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. అయినప్పటికీ యుద్ధం కంటే చర్చల ద్వారానే పరిష్కారం కోరుకుంటున్నామని చెప్పారు. ప్రస్తుతం హార్మ్యూజ్ జలసంధి ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు అత్యంత కీలక మార్గంగా ఉంది. పర్షియన్ గల్ఫ్ నుంచి ప్రపంచ దేశాలకు వెళ్లే భారీ స్థాయి ముడి చమురు, సహజ వాయువు రవాణా ఈ మార్గం ద్వారానే జరుగుతోంది. దీంతో ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు పెరిగితే అంతర్జాతీయ చమురు ధరలపై తక్షణ ప్రభావం పడే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. ఇరాన్, అమెరికా మధ్య కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులు పశ్చిమాసియాలో మరింత అస్థిరతకు దారితీసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఒకవైపు చర్చలు, మరోవైపు సైనిక హెచ్చరికలు కొనసాగుతుండటంతో ప్రపంచ దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

# అక్రమ వలసదారులకు మమత చేయూత

**తృణమూల్ నేతలో ఊతకర్ర అందించిన వైనం... సరిహద్దు వెంట అక్రమ వలసదారులు పరుగు**

**కోల్‌కతా,మే29(ఆర్ఎన్ఎ):** మమతా బెనర్జీ కాలం నాటి అక్రమాలు తన్నుకు వస్తున్నాయి. ముఖ్యంగా బంగాదేశ్ చొరబాటు దారులను ఎలా కాపాడారో కూడా అర్థం అవుతోంది. అలాగే చొరబాటు దారులకు గేట్లు బార్లా తెరిచారు. ఈ విషయం ఇప్పుడు కళ్లకు కనపడుతోంది. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బంగ్లాదేశీ అక్రమ వలసదారుల కంటిమీద కునుకు లేకుండా పోయింది. అరెస్ట్‌ల భయంతో అక్రమ వలసదారులు అల్లాడిపోతున్నారు. ఈ నేపథ్యంలోనే నిత్యం వందల మంది సరిహద్దు ప్రాంతాలు, ఇండియా నుంచి బంగ్లాదేశ్‌కు వెళ్లే మార్గాలకు చేరుకుంటున్నారు. ఇండియా టుడే కథనం మేరకు.. బంగ్లాదేశ్ తిరిగి వెళ్లిపోవటానికి ప్రయత్నిస్తున్న అక్రమ వలసదారులు మీడియాతో మాట్లాడుతూ దేశంలోకి ఎలా వచ్చారో చెప్పారు. కొంతమంది తాము నదులు దాటి భారత దేశంలోకి ప్రవేశించామని చెప్పారు. మరి కొంతమంది తాము మధ్యవర్తుల ద్వారా ఇండియాలోకి వచ్చామన్నారు. చీకటిలో సరిహద్దులు దాటి దేశంలోకి ప్రవేశించామని తెలిపారు. మధ్యవర్తుల సాయం ఉంటే 10 నిమిషాల్లో దేశంలోకి ప్రవేశించవచ్చని ఓ అక్రమ వలసదారుడు మీడియాకు తెలిపాడు. తృణమూల్ కాంగ్రెస్ పార్టీలో పని చేసే కొంతమంది కార్యకర్తల సాయంతో తాము భారత దేశంలోకి వచ్చామని, వారే తమకు అన్ని డాక్యుమెంట్లు తయారు చేసి ఇచ్చారని వెల్లడించారు. డాక్యుమెంట్ల కారణంగా తాము భారత్‌లో పలు పథకాల ద్వారా డబ్బులు పొందామని, ఓట్లు కూడా వేశామని చెప్పారు. బంగ్లాదేశ్‌లోని కుస్తియా జిల్లాకు చెందిన ఓ కార్పెంటర్ మాట్లాడుతూ.. 'నేను ఇండియాలోకి రావడానికి మధ్యవర్తికి 7 నుంచి 8 వేల రూపాయలు ఇచ్చాను. ఆ మధ్యవర్తి బీఎస్ఎఫ్ కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తుంటాడు. రాత్రి పూట బీఎస్ఎఫ్ సిబ్బంది లేని సమయంలో పెద్ద సంఖ్యలో జనాలను ఇండియాలోకి పంపుతాడు' అని చెప్పాడు. తాను ఏజెంట్‌కు 20 వేల రూపాయలు ఇచ్చి భారత్‌లోకి వచ్చానని బెంగళూరులో ఉంటున్న ఓ అక్రమ వలసదారుడు మీడియాతో చెప్పాడు. ఇలా పుంఖాను పుంఖానులుగా కథనాలు వెలువడుతున్నాయి.

# సుప్రీంకోర్టుకు ఐదుగురు కొత్త జడ్జీలు..

**కేంద్రానికి సిఫార్సు చేసిన కొలీజియం**

**న్యూఢిల్లీ,మే29(ఆర్ఎన్ఎ):** సుప్రీంకోర్టుకు కొత్తగా ఐదుగురు న్యాయమూర్తుల నియామకానికి రంగం సిద్ధం అయింది. సర్వోన్నత న్యాయస్థానంలో ఖాళీగా ఉన్న న్యాయమూర్తుల పోస్టుల భర్తీకి సుప్రీంకోర్టు కొలీజియం కసరత్తు చేపట్టింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని కొలీజియం, నలుగురు సీనియర్ హైకోర్టు న్యాయమూర్తులను, ఒక సీనియర్ న్యాయవాదిని సుప్రీంకోర్టు జడ్జీలుగా నియమించాలని కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. ఈ జాబితాలో పంజాబ్ హరియాణా హైకోర్టు సీజే జస్టిస్ షీల్ నాగు, బాంబే హైకోర్టు సీజే జస్టిస్ శ్రీచంద్రశేఖర్, మధ్యప్రదేశ్ హైకోర్టు సీజే జస్టిస్ సంజీవ్ సచ్ దేవ, జమ్మూ కశ్మీర్ లడఖ్ సీజే జస్టిస్ అరుణ్ పళ్లి, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది వి. మోహన ఉన్నారు. సుప్రీంకోర్టులో పేరుకుపోయిన కేసుల భారాన్ని తగ్గించి, న్యాయ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ఈ నియామకాలు అత్యంత కీలకమని కొలీజియం తన సిఫార్సులో పేర్కొంది. కొలీజియం పంపిన ఈ జాబితాను కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ పరిశీలించి, కేబినెట్ ఆమోదం కోసం పంపుతుంది. కేంద్ర కేబినెట్ ఆమోదం అనంతరం, రాష్ట్రపతి ద్రౌపది ముర్మ ఆమోదముద్ర వేయగానే ఈ నియామకాలు ఖరారవుతాయి. ఆ తర్వాత నూతన న్యాయమూర్తులుగా వీరు ప్రమాణ స్వీకారం చేస్తారు.

## త్రిభాషా సూత్రంపై సుప్రీంకోర్టులో పిటిషన్

**కేంద్రం, ఎన్సీఈఆర్టీలకు సుప్రీం నోటీసులు**

**న్యూఢిల్లీ,మే29(ఆర్ఎన్ఎ):** ఎన్‌సీఈఆర్టీలో త్రిభాషా సూత్రానికి సంబంధించి దాఖలైన పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన సుప్రీంకోర్టు, కేంద్ర ప్రభుత్వం, సీబీఎస్‌ఈ, ఎన్సీఈఆర్టీలకు నోటీసులు జారీ చేసింది. జులై 1వ తేదీ నుంచి 9, 10వ తరగతి విద్యార్థులు తప్పనిసరిగా మూడు భాషలు అభ్యసించాలని సీబీఎస్‌ఈ ఇటీవల నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌ను పరిశీలించేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. ఈ క్రమంలో సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం.పంచోలీలతో కూడిన ధర్మాసనం ఈ నోటీసులు జారీ చేసింది. రెండు వారాల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గీ, కపిల్ సిబాల్ వాదనలు వినిపించారు. భాష అనేది ఛాయిస్ అని, దీనిని బలవంతంగా రుద్దలేమని కపిల్ సిబాల్ అన్నారు. ఈ వ్యవహారంలో మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. తదుపరి విచారణను జులై రెండోవారానికి వాయిదా వేసింది. త్రిభాషా విధానాన్ని అమలు చేయడానికి సీబీఎస్‌ఈ లాజిస్టికల్ సంసిద్ధతపై నివేదిక సమర్పించాలని అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్యా భాటీని ఆదేశించింది.

# క్వారంటైన్ నిబంధనల్లో లోపాలు!?

**భారత మామిడిపై జపాన్ నిషేధం**

**న్యూఢిల్లీ,మే29(ఆర్ఎన్ఎ):** భారత మామిడి ఎగుమతిదారులకు జపాన్ ప్రభుత్వం షాక్ ఇచ్చింది. ఈ సీజన్‌కు గాను భారత మామిడి పండ్ల దిగుమతులను పూర్తిగా నిషేధిస్తున్నట్లు ప్రకటించింది. భారత్‌లోని క్రిమిసంహారక కేంద్రాల్లో నాణ్యతా ప్రమాణాలు సరిగా లేవని జపాన్ తనిఖీ బృందం గుర్తించడమే ఇందుకు ప్రధాన కారణం. ఈ పరిణామంతో మామిడి ఎగుమతిదారులు తీవ్ర నిరాశకు గురయ్యారు. ఉత్తరప్రదేశ్‌లోని రెహ్మాన్‌పూర్‌లో ఉన్న ఒక ప్లాంట్‌లో వేపర్ హీట్ ట్రీట్‌మెంట్ (వీహెచ్ టీ) ప్రక్రియలో లోపాలు ఉన్నట్లు జపాన్ అధికారులు గుర్తించారు. పండ్లను తెగుళ్లు, కీటకాల నుంచి రక్షించడానికి ఈ ప్రక్రియ చాలా కీలకం. ఈ నేపథ్యంలో, మార్చి 2 తర్వాత జారీ చేసిన భారతీయ సర్టిఫికెట్లతో వచ్చే మామిడి షిప్‌మెంట్‌లను అంగీకరించబోమని జపాన్‌కు చెందిన యొకోహామా ప్లాంట్ ప్రొటెక్షన్ అసోసియేషన్ స్పష్టం చేసింది. ఈ నిషేధం కారణంగా కేసర్, అల్ఫాన్సో, లంగ్రా, బంగినపల్లి వంటి ప్రసిద్ధ రకాల ఎగుమతులు నిలిచిపోయాయి. భారత మామిడి ఎగుమతిదారులు ఇప్పటికే పలు సవాళ్లతో సతమతమవుతున్నారు. పశ్చిమాసియాలో సంక్షోభం కారణంగా ఎగుమతులు 20-30 శాతం పడిపోయాయి. రవాణా ఖర్చులు పెరగడంతో పాటు, కంటైనర్ల కొరత కూడా వేధిస్తోంది. మరోవైపు, దేశంలో తీవ్రమైన వడగాడ్పుల వల్ల పంట దిగుబడి తగ్గింది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో జపాన్ నిషేధం వారిని మరింత కుంగదీసింది. 1986 నుంచి 2006 వరకు కూడా పండ్ల ఈగల కారణంగా జపాన్ భారత మామిడిపై నిషేధం విధించింది. వీహెచ్ టీ ప్రక్రియను అమలు చేశాకే ఆ నిషేధాన్ని ఎత్తివేశారు. ప్రస్తుత సమస్యను పరిష్కరించేందుకు భారత ప్రభుత్వం జపాన్‌తో చర్చలు జరుపుతున్నప్పటికీ, ఈ సీజన్‌లో ఎగుమతులు తిరిగి ప్రారంభం కావడం కష్టమేనని నిపుణులు భావిస్తున్నారు. ఈ అవకాశాన్ని పాకిస్థాన్, వియత్నాం, థాయ్‌లాండ్ వంటి దేశాలు అందిపుచ్చుకుంటున్నాయి.

# రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు

**నైపుణ్యాలతో యువత సిద్ధంగా ఉండండి... ఫేక్ కంటెంట్‌పై అప్రమత్తంగా ఉండాలి.... రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్**

**అమరావతి,మే29(ఆర్ఎన్ఎ):** యువత అంకితభావం, సమష్టి కృషి, త్యాగనిరతి వంటి గుణాలను అలవర్చుకుని భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు. రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులు వస్తున్నాయని, వాటిని అందిపుచ్చుకునేందుకు యువతను నైపుణ్యం కలిగిన మానవ వనరులుగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. మహానాడు సందర్భంగా మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో "జెన్-జీ" యువతతో ఆయన ప్రత్యేకంగా ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యువత అడిగిన పలు ప్రశ్నలకు సమాధానమిస్తూ, రాష్ట్ర అభివృద్ధిపై ప్రభుత్వ దార్శనికతను వివరించారు.రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధిని వేగవంతం చేసేందుకు ప్రజా ప్రభుత్వం క్లస్టర్ ఆధారిత విధానంతో ముందుకు సాగుతోందని లోకేష్ తెలిపారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 22 పారిశ్రామిక క్లస్టర్లను గుర్తించామని, డేటా, ఐటీ, క్వాంటం టెక్నాలజీ, రాయలసీమలో ఆటోమోటివ్, కర్నూలులో పునరుత్పాదక ఇంధన వనరుల వంటి రంగాల్లో ప్రత్యేక క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. దీనివల్ల ఒకేచోట ప్రధాన పరిశ్రమలతో పాటు, వాటికి అవసరమైన అనుబంధ పరిశ్రమలు, విడిభాగాల తయారీ యూనిట్లు ఏర్పాటవుతాయని, తద్వారా పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థ (ఎకోసిస్టమ్) నిర్మితమవుతుందని అన్నారు.



"రాష్ట్రానికి ఇప్పటివరకు రూ.23 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయి. గూగుల్, ఆర్సెలార్ మిట్టల్, రిలయన్స్ వంటి దిగ్గజ సంస్థలు ముందుకొస్తున్నాయి. ఈ అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలి" అని ఆయన సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా పాఠ్యప్రణాళికలో మార్పులు తెచ్చి, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను యువతకు అందిస్తామన్నారు. సోషల్ మీడియాలో వ్యాప్తి చెందే తప్పుడు సమాచారం పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని లోకేష్ హెచ్చరించారు. డీఎస్సీ విషయంలో ప్రతిపక్ష నేత నిరాధార ఆరోపణలు చేసి లక్షలాది మంది యువతను ఆందోళనకు గురిచేశారని విమర్శించారు. "మేం పారదర్శకంగా 150 రోజుల్లో డీఎస్సీ ప్రక్రియను పూర్తిచేశాం. సోషల్ మీడియాలో వచ్చే సమాచారాన్ని గుడ్డిగా నమ్మకుండా, వాస్తవాలను సరిచూసుకోవాలి," అని ఆయన యువతకు హితవు పలికారు.కష్టపడటం ఒక్కటే విజయానికి మార్గమని, దానికి దగ్గరి దారులు ఉండవని లోకేష్ తన వ్యక్తిగత అనుభవాలను పంచుకున్నారు.

"నేను మా నాన్నగారితో పోటీ పడాలంటే ఆయన కంటే ఎక్కువ కష్టపడాలి. నా పాదయాత్రలో రోజూ పోరాటం ఎదుర్కొన్నాను. 2019లో ఓడిపోయినా భయపడలేదు, 2024లో 91 వేల మెజారిటీతో గెలిచాను. ఆ రోజు భయపడి ఉంటే ఇది సాధ్యమయ్యేది కాదు" అని అన్నారు. పరీక్షల్లో విఫలమైతే ఆత్మహత్యలకు పాల్పడటం సరికాదని, ఒక్క ఓటమి జీవితాన్ని నిర్ధారించదని విద్యార్థులకు ధైర్యం చెప్పారు.యువత రాజకీయాల్లోకి రావాలని, తెలుగుదేశం పార్టీ వారికి సముచిత అవకాశాలు కల్పిస్తుందని భరోసా ఇచ్చారు. పోరాట స్ఫూర్తిని అలవర్చుకోవాలని సూచించారు. మహిళా సాధికారత ప్రతి ఇంటి నుంచే మొదలుకావాలని, వారికి 33 శాతం రిజర్వేషన్ల అమలుకు అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. యువతకు ఉద్యోగాల కల్పనే తమ ప్రభుత్వ ఏకైక అజెండా అని, పెద్ద పరిశ్రమలతో పాటు ఎంఎస్ఎంఈలకు కూడా అంతే ప్రాధాన్యం ఇస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలు యూనివర్సిటీలకు చెందిన విద్యార్థులు వేమూరి సాత్విక్, చరణ్ యాదవ్, సత్యసాయి పవన్ కుమార్, ఖ్యాతి వర్ధిని పాల్గొన్నారు.

# చీకాకు పెట్టే జుట్టు సమస్యలకు మేలైన చికిత్స



పొడవాటి జుట్టు లేదా అందమైన బన్ను తయారు చేయడానికి మీ జుట్టును ఆరోగ్యంగా ఉంచడం ముఖ్యం. ఈ జీవనశైలి కారణంగా, మీ జుట్టు పొడి లేదా జిడ్డుగల చర్మం, చుండ్రు, జుట్టు రాలడం వంటి సమస్యలను ఎదుర్కొంటుంది. పొడి జుట్టు చాలా చికాకు కలిగిస్తుంది. మీ జుట్టు చాలా నిర్జీవంగా కనిపించడమే కాదు, జుట్టు మసకబార డానికి కూడా కారణం అవుతుంది. చాలా తరచుగా, శీతాకాలంలో, వేసవి కాలంలో ఈ పొడితనం చాలా పెరుగుతుంది. అందువల్ల, పొడి జుట్టుతో పండ్లను ప్యాక్ చేయడం మంచి పరిష్కారం. మీరు ఎల్లప్పుడూ మార్కెట్లో అందుబాటులో ఉన్న ఏదైనా రెడీమేడ్ హెయిర్ ప్యాక్‌ని ఉపయోగించవచ్చు. అయితే, ఇందులో ఉపయోగించే రసాయనాలు మీ జుట్టు ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. కాబట్టి, పొడి జుట్టు నివారించడానికి పండ్లతో హెయిర్ ప్యాక్ ప్రయత్నించండి.

అధిక ఒత్తిడి, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, అనేక అంశాలు పొడి జుట్టు సమస్యకు దోహదం చేస్తాయి. కాబట్టి, ఆరోగ్యకరమైన జుట్టు కోసం కొన్ని పండ్లతో నిండిన హెయిర్ ప్యాక్‌లను వాడండి. ఇది మార్కెట్లో లభించే అత్యంత ఖరీదైన హెయిర్ ప్యాక్ కంటే చాలా మంచిది. ఈ పండ్ల నుండి తయారైన హెయిర్ ప్యాక్‌లు జుట్టుకు సహజమైన షైన్‌ని తీసుకురావడం ఖాయం. ఈ పండ్లను ప్యాక్ పొడి జుట్టుకి ఉపయోగించి తర్వాత వచ్చిన మార్పును గమనించండి. జుట్టు అందాన్ని పెంచే రహస్యం ఈ క్రింది పండ్లలో దాగున్నాయి..!

**బనానాస్**

పొడి నెత్తికి అరటి ప్యాక్ వాడండి. పొడి నెత్తికి ఇది చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. అరటిపండును పిండి, గుడ్డులోని తెల్లసొనతో బాగా కలపాలి. చర్మం మరియు జుట్టును బాగా వర్తించండి. దీన్ని 15-20 నిమిషాలు అలాగే ఉంచి బాగా కడగాలి.

**ఆపిల్**

ఆపిల్ పొడి చర్మం కోసం మరో అద్భుతమైన హెయిర్ ప్యాక్. షాంపూ చేసిన తరువాత, ఆపిల్ రసాన్ని కండీషనర్‌గా ఉపయోగించవచ్చు. విటమిన్ సి ఉన్న ఆపిల్ మీ జుట్టును మృదువుగా, మెరిసేలా చేస్తుంది.

**లైమ్ ఫ్రూట్**

పొడి నెత్తికి ఇది ఉత్తమమైన ఫ్రూట్ ప్యాక్లలో ఒకటి. నిమ్మరసంతో నెత్తిమీద నేరుగా రుద్దండి లేదా పెరుగు,తేనెతో నిమ్మరసం కలపండి.

**బొప్పాయి**

ఇది తల పొడిబారడాన్ని తగ్గిస్తుంది. జుట్టు రాలడాన్ని తగ్గిస్తుంది. మెత్తని బొప్పాయిని పాలు, తేనెతో కలపండి. మీ జుట్టును బ్రష్ చేయండి. మీ జుట్టును ప్రకాశవంతం చేయడానికి ఈ పద్ధతి క్రమం తప్పకుండా చేయవచ్చు.

**దోసకాయలు**

మీరు క్రమం తప్పకుండా ఈత కొడుతుంటే, నీటిలోని క్లోరిన్ మీ జుట్టును పొడిగా ఉంచుతుంది. తరిగిన దోసకాయ, ఒక టేబుల్ స్పూన్ ఆలివ్ ఆయిల్, గుడ్డు యొక్క తెల్లని భాగాన్ని కలపండి. దీన్ని 15 నిమిషాలు అలాగే ఉంచి శుభ్రం చేయండి.

**పీచ్ పండ్లు**

పీచు బెర్రీలు ఎంత ఉపయోగకరంగా ఉన్నాయో మీకు తెలుసా? పీచు పండ్లను పిండి, మొజారెల్లాకు జోడించండి. ఈ పేస్ట్‌ను మీ నెత్తిమీద మొత్తం వైపు మెత్తగా పూయండి. వాటిని సరిగ్గా కడగాలి. ఇలా చేయడం ద్వారా మీరు ఖచ్చితంగా మీ జుట్టులో మార్పులను గమనించవచ్చు.

**కొబ్బరికాయలు**

మీరు వీటిని నేరుగా ఉపయోగించలేరు. కొబ్బరి నూనె లేదా కొబ్బరి పాలు మాత్రమే వాడండి. కొబ్బరి మీ నెత్తిలోని తేమను ఉంచడానికి సహాయపడుతుంది. మళ్ళీ తేమను కోల్పోకుండా సహాయపడుతుంది.

**ప్లం బెర్రీలు**

పొడి చర్మం కోసం చేయగలిగే ఉత్తమ ఫ్రూట్ ప్యాక్లలో ఇది ఒకటి. ఇది మీ జుట్టును ఆరోగ్యంగా ఉంచుతుంది. ప్లం ఫ్రూట్‌తో ఎలాంటి జుట్టు అయినా ప్యాక్ చేయండి. ఇది జుట్టు రాలడాన్ని కూడా తగ్గిస్తుంది. బెర్రీ బెర్రీలు ఈ జ్యుసి పండ్లలో బయోఫ్లవనోయిడ్ పుష్కలంగా ఉంటుంది. ఇది జుట్టుకు రక్త ప్రవాహాన్ని ప్రేరేపిస్తుంది. ఈ పండ్లు మీ నెత్తి, జుట్టుకు సరైన తేమను అందిస్తాయి.జుట్టు రాలడాన్ని తగ్గించడంలో సహాయపడతాయి.

**ఆరెంజ్**

ఇది మీ చర్మం, జుట్టుకు తేమకు మూలం. మీ హెయిర్ ప్యాక్‌లో నారింజ రసాన్ని చేర్చండి. లేదా ఆరెంజ్ పీల్ పౌడర్ తయారు చేసి దాని నుండి హెయిర్ ప్యాక్ తయారు చేసుకోండి.

## శరీర బరువు తగ్గాలంటే
# ఈ ఆహారాలను తినడం మానేయండి

నాలుక రుచి మొగ్గలను ఆకర్షించే అనేక వింతైన వంటకాలు కనుగొనబడ్డాయి. కాబట్టి నాలుకకు రుచి చూపకుండా అణిచివేయడం కొంచెం కష్టం. మీరు ఆహార ప్రేమికులైతే, మీరు నాలుకను నియంత్రించలేరు. ఈ రోజు చాలా మంది స్థూలకాయానికి ముఖ్య కారణం ఆహారం, జీవన విధానం.ఎందుకంటే ప్రస్తుత జీవన శైలిలో ఎన్నో మార్పులు, చాలా మంది ప్రజలు ఒకే స్థలంలో ఎక్కువ సమయం కూర్చొని పనిచేస్తున్నందున, ఆహారంలో ఉన్న కొవ్వులు శరీరానికి తగినంత పని లభించకుండా ఆ స్థానం లో ఉంటాయి.ఫలితంగా, చాలా మంది ఊబకాయం, బొడ్డు సమస్యలతో బాధపడుతున్నారు.ఇప్పుడు బొజ్జ, ఊబ కాయంను వెంటనే నివారించడానికి ఆహారాలను చూద్దాం.



**ఫ్రెంచ్ ఫ్రైస్,బంగాళాదుంప చిప్స్**

బంగాళాదుంపలు అందరికీ ఇష్టమైన కూరగాయ. వీటిని సన్నగా పొడుగ్గా ముక్కలు చేసి చాలా సార్లు ఉడికించి తినవచ్చు. బంగాళాదుంపలతో అత్యంత వినూత్నమైన అల్పాహారాలలో ఒకటి ఫ్రెంచ్ ఫ్రైస్ , బంగాళాదుంప చిప్స్. ఇది పూర్తిగా నూనెలో వేయించినందున, ఇందులో కొవ్వులు చాలా పుష్కలంగా ఉంటాయి. ఎవరైనా దీన్ని ఎక్కువగా తీసుకుంటే అది ఊబకాయానికి కారణమవు తుంది. కాబట్టి బరువు తగ్గాలని చూస్తున్న వారికి, తప్పించుకోవలసిన మొదటి ఆహారాలలో ఒకటి ఫ్రెంచ్ ఫ్రై మరియు బంగాళాదుంప చిప్స్.

**చక్కెర మిశ్రమ,కార్బోనేటేడ్ పానీయాలు**

పానీయం చక్కెరతో కలిపినప్పుడల్లా, ఆ పానీయం అనారోగ్యకరమైన పానీయం. చక్కెర అనేది ఒకరి శరీర బరువు , ఆరోగ్యంపై చెడు ప్రభావాన్ని చూపే పదార్థం. కాబట్టి ఊబకాయంతో బాధపడేవారు చక్కెర పానీయాలకు దూరంగా ఉండాలి. అలాగే, కార్బోనేటేడ్ పానీయాలను తాకవద్దు.

**ఐస్ క్రీం**

చక్కెరలో ఐస్ క్రీం అధికంగా ఉంటుంది. ఇది ఒకరి శరీర బరువును పెంచే ఆహార పదార్థం కూడా. మీకు ఐస్ క్రీం తినాలని కోరిక ఉంటే, ఇంట్లో ఐస్ క్రీం తయారు చేయడానికి ప్రయత్నించండి. దీన్ని పరిమాణంలో తినాలి.

**పిజ్జా**

పిజ్జా ఇప్పుడు చాలా మంది ప్రజలు వండడానికి, ఆర్డర్ చేయడానికి చా లా సోమరి అయిన ఆహార పదార్థం. దుకాణాలలో తయారు చేయబడిన ,విక్రయించే పిజ్జా బాగా శుద్ధి చేయ బడింది. ప్రాసెస్ చేసిన పదార్థా లను కలిగి ఉంటుంది. కాబట్టి వీటిని నివారించడం మంచిది.

మీరు ఇంట్లో పిజ్జా తయారు చేయగలరు కాబట్టి, దుకాణాల్లో ఎందుకు కొనాలి? ఇంట్లో తయారు చేసిన పిజ్జా గొప్ప పరిష్కారం, ఎందుకంటే దీనిని ఆరోగ్యకరమైన పదార్థాలతో తయారు చేయవచ్చు.

**కాఫీ**

కాఫీలోని బ్లాక్ కాఫీ ఆరోగ్యకరమైన ఎంపిక. ఇతర రకాల కాఫీ పానీయాలలో కృత్రిమ పదార్థాలు ఉన్నాయి. అవి అనారోగ్యకరమైనవి. కొవ్వుతో నిండి ఉన్నాయి.

**వైట్ బ్రెడ్**

తెల్ల రొట్టె పూర్తిగా మైదాతో తయారు చేయబడింది. మీరు ఎక్కువ రొట్టెలు తింటే, అది మీ రక్తంలో చక్కెరను పెంచుతుంది. మీరు చాలా ఆకలితో ఉంటే, మీరు తెల్ల రొట్టె తినడానికి బదులు మరికొన్ని మంచి ఆహారాన్ని తినవచ్చు.

గ్రానోలా బార్లు

ఈ రకమైన బార్లు చాలా అనారోగ్యకరమైనవి. దీనికి కారణం చక్కెర, శుద్ధి చేసిన పిండి, నూనెలు. అదనంగా, ఇందులో కేలరీలు అధికంగా ఉంటాయి.

వీటితో మీ కడుపు నింపడం మంచిది కాదు. బహుశా మీరు స్నాక్స్ వద్ద ఏదైనా తినాలని చూస్తున్నట్లయితే, పండు లేదా నట్స్ తినండి.

**జ్యూస్**

అనేక వినూత్న రసాలను ప్రస్తుతం మార్కెట్లో విక్రయిస్తున్నారు. ప్యాకెట్లలో ప్యాక్ చేసిన రసాలలో కేలరీలు అధికంగా ఉంటాయి. చక్కెర పుష్కలంగా ఉంటుంది. ఆ రకమైన రసాలలో ఫైబర్ ఉండదు. కాబట్టి ఈ రకమైన రసాలను త్రాగడానికి బదులుగా, పండు తినడం మంచిది.

**కేక్, మిఠాయి, కుకీ**

ఈ రకాలు చక్కెర, శుద్ధి చేసిన పిండి మరియు నూనెతో క్రీముగా ఉంటాయి. వాటిలో పోషకాలు ఉండవు. కానీ ఇందులో కేలరీలు అధికంగా ఉంటాయి. ఒకరు ఎక్కువగా తింటే అది ఊబకాయానికి దారితీస్తుంది.

**వైన్**

మద్యపానం తీసుకోని పురుషులను చూడటం చాలా అరుదు. కానీ మీరు మీ బొజ్జ ఊబకాయం తగ్గించాలని ఆలోచిస్తుంటే, మద్యపానం మానేయండి. ముఖ్యంగా బీరు తాగవద్దు. ఇది బొజ్జ పరిమాణాన్ని మాత్రమే పెంచుతుంది.

# ఈ జబ్బులతో బాధపడేవారు ఉసిరి కాయను తినరాదు

ఉసిరి కాయ. ఇందులో రోగనిరోధక శక్తిని పెంచే విటమిన్లు వున్నాయి. ఐతే ఇప్పుడు చెప్పబోయే జబ్బులతో బాధపడేవారు పొరపాటున కూడా ఉసిరికాయ తినకూడదు, తింటే బాధపడాల్సి వస్తుంది.అవి ఏమిటో తెలుసుకుందాము. హైపర్ అసిడిటీతో బాధపడుతుంటే ఉసిరిని ఖాళీ కడుపుతో తినకూడదు. ఏ రకమైన రక్త రుగ్మతతో బాధపడేవారికి ఉసిరి మంచిది కాదు. ఏదైనా శస్త్రచికిత్స జరిగినా లేదా చేయబోతున్నా ఉసిరిని కొంత కాలం పాటు వాడకూడదు. తక్కువ రక్తపోటుతో బాధపడుతున్న వ్యక్తులు ఉసిరిని వాడకూడదు. గర్భిణీ లేదా పాలిచ్చే స్త్రీలు వైద్యుడిని సంప్రదించిన తర్వాత మాత్రమే ఉసిరిని తినాలి. డ్రై స్కాల్ప్ లేదా డ్రై స్కిన్ సమస్య ఉంటే, ఉసిరికాయను ఎక్కువగా తింటే సమస్య మరింత తీవ్రమవుతుంది. ఇప్పటికే అనారోగ్య సమస్యలుంటే ఎలాంటి మందులు వాడుతున్నారో వైద్యుడిని సంప్రదించిన తర్వాత ఉసిరిని తీసుకోవాలి.



# కేరళంలో ఇడి అధికారులపై దాడి

### 8మందిని అరెస్ట్ చేసినట్లు రాష్ట్ర డిజిపి వెల్లడి

**తిరువనంతపురం,మే29(ఆర్ఎన్ఎ):** కేరళం మాజీ సీఎం పినరయి విజయన్ నివాసంలో ఈడీ రెయిడ్స్ సందర్భంగా అధికారులపై దాడికి యత్నించిన 8 మందిని అరెస్టు చేశామని రాష్ట్ర పోలీస్ చీఫ్ ఎ. చంద్రశేఖర్ గురువారం తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఇతర నిందితులను ఇప్పటికే గుర్తించామని కూడా తెలిపారు. హోం మంత్రి రమేశ్ చెన్నితాలతో సమావేశం అనంతరం ఆయన ఈ వివరాలు వెల్లడించారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని హోం మంత్రి ఆదేశించారని అన్నారు. బుధవారం ఈడీ రెయిడ్స్ గురించి తెలియగానే భారీ స్థాయిలో పోలీసులను పంపించామని కూడా పోలీస్ చీఫ్ తెలిపారు. 'తాము వస్తున్నట్టు ఈడీ అధికారులు ముందుగా మాకు చెప్పలేదు. కానీ ఆపరేషన్ మొదలవగానే మేము భద్రత కోసం సెక్యూరిటీని పంపించాము' అని తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఇప్పటివరకూ కేరళ పోలీసులు దాదాపు 300 మందిపై కేసులు పెట్టారు. అనుమతిలేకుండా గుమిగూడటం, ప్రభుత్వ అధికారులపై దాడి, అక్రమ నిర్బంధం, హత్యాయత్నం తదితర అభియోగాలతో కేసులు నమోదు చేశారు. మ్యూజియమ్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్ ప్రకారం, ఈడీ అధికారులపై నిందితులు కర్రలతో దాడి చేశారు. ఈ క్రమంలో ఒక అధికారి చేయికి గాయమైంది. ఈడీ వాహనం అద్దాలు పగిలిపోయాయి. ఈ దాడిలో కారు డ్రైవర్ కూడా గాయపడ్డారు. పరిస్థితి అదుపు చేసేందుకు ప్రయత్నించిన కేరళ పోలీసులు, సీఆర్‌పీఎఫ్ పోలీసులను కూడా నిరసనకారులు టా÷-గ్గ్ ÷ట్ చేశారు. నిరసన కారుల వల్ల దాదాపు రూ.3 లక్షల మేర నష్టం జరిగినట్టు తెలుస్తోంది. సీఎంఆర్ఎల్ మనీలాండరింగ్ కేసుకు సంబంధించి మాజీ సీఎం పినరయి విజయన్, ఆయన కుటుంబసభ్యుల ఇళ్లల్లో ఈడీ బుధవారం ఈ సోదాలు నిర్వహించిన విషయం తెలిసిందే.

# మధుబని రైల్వు స్టేషన్‌లో ప్రమాదం

### ఖాళీ బోగీలో చెలరేగిన మంటలు

**పాట్నా,మే29(ఆర్ఎన్ఎ):** బీహార్ మధుబని రైల్వే స్టేషన్‌లో గురువారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. జయనగర్-ఉద్నా అంత్యోదయ ఎక్స్‌ప్రెస్ రైలు అగ్నిప్రమాదానికి గురైంది. ఓ ఖాళీ బోగీలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. నిమిషాల వ్యవధిలోనే బోగీ మొత్తం మంటలు వ్యాపించి పూర్తిగా దగ్ధమైంది. ప్లాట్‌ఫామ్ నంబర్-3పై షంటింగ్ పనుల నిమిత్తం రైలు నిలిచి ఉన్న సమయంలో ప్రమాదం జరిగింది. దీంతో అధికారులు, ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. మధుబని రైల్వే స్టేషన్ ప్రాంగణంలో భయాందోళనలు నెలకొన్నాయి. రైల్వే సిబ్బంది వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సుమారు పది అగ్నిమాపక వాహనాలు రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాయి. గంటపాటు శ్రమించి వారు మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంపై సమస్తిపూర్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ జ్యోతి ప్రకాశ్ మిశ్రా స్పందించారు. రైల్వే యంత్రాంగం ప్లాట్‌ఫామ్ ప్రాంతాన్ని ఖాళీ చేయించి విస్తృతంగా భద్రతా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. అగ్నిప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఘటనలో అసాంఘిక శక్తుల ప్రమేయంపైనా ఆరా తీస్తున్నట్లు జ్యోతి ప్రకాశ్ మిశ్రా చెప్పారు. ఇదిలా ఉండగా.. 2022లో అదే ఎ÷-లాట్‌ఫామ్‌పై నిలిచి ఉన్న స్వతంత్ర సేనాని ఎక్స్‌ప్రెస్ ప్రమాదానికి గురై ఐదు కోచ్‌లు దహనమయ్యాయి.

## ప్రధాని కార్యాలయ పర్యవేక్షణలో నీట్ టెస్ట్... పకడ్బందీ చర్యలకు దిగిన కేంద్రం

**న్యూఢిల్లీ,మే29(ఆర్ఎన్ఎ):** నీట్ పేపర్ లీక్ వ్యవహారం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. దాంతో మే 3న జరిగిన ప్రవేశపరీక్ష రద్దు కావడంతో.. జూన్ 21 రీటెస్ట్ నిర్వహించేందుకు కేంద్ర విద్యాశాఖ నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మరోసారి ఎలాంటి లోపాలు తలెత్తకుండా కేంద్రం చర్యలు తీసుకుంటోంది. ఈసారి రీటెస్ట్ ప్రక్రియను ప్రధానమంత్రి కార్యాలయం నిశితంగా పరిశీలిస్తున్నట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. దిల్లీలోని తన నివాసంలో రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు.

# జగన్ పీఏ కేఎన్ఆర్ నివాసంలో సిట్ తనిఖీలు

**అమరావతి,మే29(ఆర్ఎన్ఎ):** ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసులో దర్యాప్తు ముమ్మరమైంది. ఇందులో భాగంగా వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ వ్యక్తిగత సహాయకుడు (పీఏ) కె.నాగేశ్వరరెడ్డి (కేఎన్ఆర్) నివాసంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) గురువారం తనిఖీలు చేపట్టింది. మద్యం లావాదేవీలకు సంబంధించి విజయవాడలోని ఆయన నివాసంలో అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. మరోవైపు, సిట్ కార్యాలయంలో కేఎన్ఆర్‌ను అధికారులు విచారిస్తున్నారు. గురువారం ఉదయం 11 గంటల నుంచి ఆయనను ప్రశ్నిస్తున్నారు. బుధవారం కూడా కేఎన్ఆర్‌ను సిట్ అధికారులు దాదాపు 9.5 గంటల పాటు విచారించిన విషయం తెలిసిందే. విచారణలో ఆయన పొంతనలేని సమాధానాలు ఇస్తున్నట్లు సమాచారం. సిట్ దర్యాప్తులో కేఎన్ఆర్ ఆస్తులకు సంబంధించి కీలక విషయాలు వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. ఆయన భార్య శశికళ పేరిట తిరుపతి జిల్లాలో 10 ఎకరాల భూమి ఉన్నట్లు, ఆమె బ్యాంకు ఖాతాలో 2019-24 మధ్య సుమారు రూ. 19.86 కోట్లు జమ అయినట్లు అధికారులు గుర్తించినట్టు సమాచారం. వీటికి తోడు విజయవాడలో ఒక కార్ షోరూంలో వాటా, హైదరాబాద్, తిరుపతి, బెంగళూరులో ఫ్లాట్లు, పలు జిల్లాల్లో ఆస్తులు ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సాధారణ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన కేఎన్ఆర్, జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అనూహ్యంగా ఆస్తులు కూడబెట్టిన కోణంలో సిట్ దర్యాప్తు చేస్తోంది. ఒకవైపు విచారణ కొనసాగుతుండగానే, మరోవైపు నివాసంలో సోదాలు జరగడం ఈ కేసులో తీవ్రతను తెలియజేస్తోంది.

## విజయన్ ఇమేజ్ డ్యామేజ్ చేసేందుకే దాడులు

### ఈడీ సోదాలపై సీపీఐ రామకృష్ణ విమర్శలు

**అమరావతి,మే29(ఆర్ఎన్ఎ):** కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్ నివాసంలో ఈడీ అధికారులు నిన్న సోదాలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారం దేశ వ్యాప్తంగా సంచలనం రేకెత్తించింది. ఈ దాడులపై ఏపీ సీపీఐ నేత రామకృష్ణ తీవ్రంగా స్పందించారు. దాడులను ఖండించిన ఆయన... సోదాలు నిర్వహించిన అధికారులు ఒట్టి చేతులతోనే వెనక్కి వెళ్లిపోయారని ఎద్దేవా చేశారు. పదేళ్ల పాటు కేరళ ముఖ్యమంత్రిగా ఉన్న విజయన్ కు ప్రజల్లో మంచి ఇమేజ్ ఉందని... ఆ ఇమేజ్ డ్యామేజ్ చేసేందుకే ఈడీ దాడులు జరిగాయని రామకృష్ణ విమర్శించారు. మోదీ ప్రధాని అయినప్పటి నుంచి ప్రతిపక్ష నేతలపై ఈడీ దాడులు, అక్రమ కేసులు సాధారణమై పోయాయని దుయ్యబట్టారు. ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీష్ శిసోడియా విషయంలో కూడా ఇదే జరిగిందని రామకృష్ణ అన్నారు. బీజేపీ కండువా కప్పుకునే వారు ఎవరైనా సరే వారిపై ఎలాంటి దాడులు జరగవని చెప్పారు.

# అది గొడ్డలి పార్టీ, మాది రాజ్యాంగాన్ని నమ్మిన పార్టీ

### ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత

**అమరావతి,మే29(ఆర్ఎన్ఎ):** తెలుగుదేశం పార్టీ మహానాడు వేదికగా రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ప్రత్యర్థి పార్టీపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గత ఐదేళ్ల పాలన విధ్వంసకరంగా సాగిందని, అది ప్రజావేదిక కూల్చివేతతో మొదలైందని ఆరోపించారు. ప్రత్యర్థి పార్టీని"గొడ్డలి పార్టీ"గా అభివర్ణించిన ఆమె, టీడీపీ రాజ్యాంగాన్ని గౌరవించే పార్టీ అని స్పష్టం చేశారు. మహానాడు రెండో రోజు రాజకీయ తీర్మానాన్ని బలపరుస్తూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో అమరావతి కోసం పోరాడిన మహిళలను బూటుకాళ్లతో తొక్కించారని, నారా లోకేష్ చేపట్టిన 'యువగళం' పాదయాత్రకు అడుగడుగునా అడ్డంకులు సృష్టించారని అనిత ధ్వజమెత్తారు. దళితుడిని హత్య చేసి డోర్ డెలివరీ చేసిన వ్యక్తిని మండలికి పంపిన నీచపు ఘనత ఆ పార్టీదేనని తీవ్రంగా విమర్శించారు. తాము గొడ్డళ్లు చేతికిచ్చే పార్టీ కాదని, యువనేత లోకేష్ రాజ్యాంగబద్ధమైన పాలన అందిస్తారని, ఆయన చేతిలో ఉన్నది 'రెడ్ బుక్' అని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోనే రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందని అనిత అన్నారు. 2014లో నవ్యాంధ్రకు సీఎంగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు, అమరావతి, పోలవరం పనులను పరుగులు పెట్టించారని గుర్తు చేశారు. రూ.200 ఉన్న పెన్షన్‌ను రూ.2000కు పెంచిన ఘనత ఆయనదేనని కొనియాడారు. రానున్న 20 ఏళ్లు ఇదే ప్రభుత్వం కొనసాగితే, 2047 నాటికి ఆంధ్రప్రదేశ్ ప్రపంచంలోనే మొదటి స్థానంలో నిలుస్తుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. ఈ మహానాడును మహిళలకు అంకితం చేసిన చంద్రబాబుకు ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తెలుగుదేశం పార్టీ మహానాడు-2026 రెండో రోజు సమావేశాలు వాడివేడిగా సాగాయి. మౌలిక సదుపాయాలు, దేవాలయాల పరిరక్షణపై ప్రవేశపెట్టిన తీర్మానాల సందర్భంగా టీడీపీ నేతలు గత వైసీపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గత పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లోనూ వెనక్కి వెళ్లిందని ఆరోపించారు. మౌలిక సదుపాయాలపై ప్రవేశపెట్టిన తీర్మానంపై ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడారు. 2019-24 మధ్య వైసీపీ పాలనలో రాష్ట్రంలో కేవలం 1,800 కిలోమీటర్ల రోడ్లు మాత్రమే నిర్మించారని, తమ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే 5,050 కిలోమీటర్ల రహదారులను నిర్మించిందని ఆయన పోల్చి చెప్పారు. వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రాష్ట్రంలోని రోడ్లలో 50 శాతం దెబ్బతిన్నాయని ఆరోపించారు. అమరావతి కోసం భూములిచ్చిన రైతులు 1,631 రోజుల పాటు ఉద్యమం చేశారని, ఈ పోరాటంలో 230 మంది ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు. "మావిగన్" పేరుతో వైసీపీ డ్రామాలు ఆడుతోందని, వారి గన్ కల్చర్ ఇంకా పోలేదని విమర్శించారు.

## క్షేత్రస్థాయిలో పోరాడినట్టే సోషల్ మీడియాలోనూ పోరాడాలి

### 'మహానాడు'లో రామ్మోహన్ నాయుడు

**అమరావతి,మే29(ఆర్ఎన్ఎ):** క్షేత్రస్థాయిలో పార్టీ కోసం ఎంతగా శ్రమిస్తున్నామో, అదే స్థాయిలో సోషల్ మీడియాలో కూడా కష్టపడాలని తెలుగుదేశం పార్టీ శ్రేణులకు కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయి పోరాటంతో పాటు, ఆన్‌లైన్‌లో కూడా పార్టీ సిద్ధాంతాలను, ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కి చెప్పారు. గురువారం తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో జరుగుతున్న మహానాడు-2026 రెండో రోజు కార్యక్రమంలో ఆయన రాజకీయ తీర్మానాన్ని ప్రవేశపెట్టి, సుదీర్ఘంగా ప్రసంగించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ, 1982లో ఎన్టీఆర్ తెలుగువారి ఆత్మగౌరవం కోసం టీడీపీని స్థాపించి దేశ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టించారని గుర్తుచేశారు. పార్టీ పెట్టిన 9 నెలల్లోనే కాంగ్రెస్‌ను గద్దె దించి అధికారంలోకి వచ్చిన ఘనత టీడీపీదని అన్నారు. "సమాజమే దేవాలయం -- ప్రజలే దేవుళ్లు" అనే ఎన్టీఆర్ సిద్ధాంతాన్ని చంద్రబాబు తన పాలనలో నిజం చేసి చూపిస్తున్నారని కొనియాడారు. బడుగు, బలహీన వర్గాలకు రాజకీయ అవకాశాలు కల్పించి, యువతను ప్రోత్సహించిన పార్టీ టీడీపీ అని తెలిపారు. పార్టీ మూడు తరాల నాయకత్వం గురించి ఆయన ఆసక్తికరంగా వివరించారు. ఎన్టీఆర్ తెలుగువారికి ఆత్మగౌరవాన్ని నేర్పితే, చంద్రబాబు "విజన్" అనే పదానికి అర్థం చెప్పి రాష్ట్రానికి ఆత్మవిశ్వాసాన్ని పెంచారని అన్నారు. ఇక నారా లోకేష్, "ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్" నుంచి "స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్" స్థాయికి రాష్ట్రాన్ని తీసుకెళ్లి కేవలం రెండేళ్లలో రూ. 24 లక్షల కోట్ల పెట్టుబడులకు శ్రీకారం చుట్టారని

# నందిగామ ఆర్యవైశ్యుల ఆగ్రహం..పంచ్ ప్రభాకర్‌పై ఫిర్యాదు...



**నందిగామ మే29 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** నందిగామలో ఆర్యవైశ్య సంఘం నాయకులు పంచ్ ప్రభాకర్‌పై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆర్యవైశ్య సామాజిక వర్గాన్ని కించపరిచేలా ఆయన మాట్లాడారని ఆరోపిస్తూ, వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఆర్యవైశ్యులకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. వ్యాపార రంగం మాత్రమే కాకుండా దానధర్మాలు, సేవా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ఆర్యవైశ్యుల పాత్ర ఎంతో గొప్పదని పేర్కొన్నారు. సమాజ అభివృద్ధికి తమ వర్గం ఎన్నో సేవలు అందిస్తోందని తెలిపారు అలాంటి గౌరవనీయమైన సామాజిక వర్గాన్ని అవమానించేలా వ్యాఖ్యలు చేయడం బాధాకరమని మండిపడ్డారు. సామాజిక వర్గాల మధ్య విభేదాలు రెచ్చగొట్టేలా మాట్లాడటం సమాజానికి మంచిది కాదన్నారు. ప్రజల్లో ద్వేషాలు పెంచే వ్యాఖ్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. పంచ్ ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఈ ఫిర్యాదు కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు, వ్యాపారవేత్తలు, యువజన ప్రతినిధులు పాల్గొన్నారు. సమాజ గౌరవాన్ని కాపాడేందుకు అవసరమైతే ఉద్యమాలు కూడా చేపడతామని తెలిపారు.

# అనుమంచిపల్లి గ్రామంలో 20 గంటలుగా చీకట్లో గ్రామం నీటి కోసం తెలంగాణకు పరుగులు...



**నందిగామ మే29 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** జగ్గయ్యపేట మండలం అనుమంచిపల్లి గ్రామంలో విద్యుత్ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయి 20 గంటలు గడిచినా పునరుద్ధరణ కాకపోవడంతో ప్రజల జీవనం అస్తవ్యస్తమైంది. కరెంట్ లేక బోర్లు పనిచేయక తాగునీటి కొరత తీవ్రమైంది. దీంతో గ్రామస్థులు పక్క రాష్ట్రం తెలంగాణలోని సూర్యాపేట జిల్లా నల్లగొండ గ్రామం నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. గ్రామంలో చిన్నపిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంట చేసుకునేందుకు కూడా నీరు లేక అవస్థలు పడుతున్నామని తెలిపారు. రాత్రి సమయంలో గ్రామమంతా చీకట్లు అలుముకోవడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. విద్యుత్ సమస్యపై పలుమార్లు అధికారులకు సమాచారం ఇచ్చినా స్పందన లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ లోపమా లేదా విద్యుత్ లైన్ దెబ్బతిన్నదా అన్న విషయంపై కూడా అధికారులు స్పష్టత ఇవ్వడం లేదని మండిపడుతున్నారు. మొబైల్ ఫోన్లు ఛార్జింగ్ చేసుకునే పరిస్థితి కూడా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించి, తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు స్పందించకపోతే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు

# విద్యాశాఖను భ్రష్టు పట్టించిన లోకేష్

## – మెగా డీఎస్సీ అక్రమాలపై తక్షణమే సిబిఐ దర్యాప్తునకు ఆదేశించాలి !

**పల్నాడు మే29 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** పల్నాడు జిల్లా విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీ లో జరిగిన అవకతవకలపై సిబిఐ దర్యాప్తు నిర్వహించాలని శుక్రవారం నరసరావుపేట జిల్లా కేంద్రంలోనీ స్థానిక గడియార స్తంభం వద్ద బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పలనాడు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ శ్రీ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి , వినుకొండ నియోజకవర్గ సమన్వయకర్త బొల్లా బ్రహ్మనాయుడు, సత్తెనపల్లి నియోజకవర్గం సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి గ మరియు విద్యార్థి విభాగం పల్నాడు జిల్లా అధ్యక్షులు గుజర్లపూడి ఆకాష్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. నారా లోకేష్ విద్యా శాఖ మంత్రి కాదు ఆయన సకల శాఖ మంత్రి అని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. విద్యాశాఖను లోకేష్ భ్రష్టు పట్టించాడని, ఈ కూటమి ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీ అవకతవకలతో కూడి అవినీతి మయంగా మారిందని, ఈ సందర్భంగా ఈ కూటమి ప్రభుత్వానికి సూటిగా ఐదు ప్రశ్నలు సంధించారు.. 1 కంప్యూటర్ సెక్షన్లో అవుట్సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తున్న వ్యక్తికి కృష్ణా జిల్లా డీఎస్సీలో ఫస్ట్ ర్యాంకు ఎలా వచ్చింది? మెగా డీఎస్సీలోపేపరు లీక్ అయిన మాట వాస్తవం కాదా? పేపర్ లీక్ అయిన విషయం తెలిసి కూడా విద్యాశాఖ మంత్రి లోకేష్ మౌనంగా ఎందుకు ఉన్నారు? 2 .మెగా డీఎస్సీ మెరిట్ లిస్టు ఎందుకు రిలీజ్ చేయలేదు? మెరిట్ లిస్టు రిలీజ్ చేయకుండా మీరు ఎవరికైతే ఉద్యోగాలు ఇవ్వదలు చుకున్నారో వారికే కాల్ లెటర్స్ పంపించింది వాస్తవ కాదా? వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో క్లాస్ ఫోర్ ఉద్యోగస్తులకు కూడా మెరిట్ లిస్ట్ చేసింది వాస్తవం కాదా? మెరిట్ లిస్టు రిలీజ్ చేయకుండా జాయినింగ్ లెటర్లు ఎలా ఇచ్చారు? 3 .ఆటలాడటమే తెలియని వారికి స్పోర్ట్స్ కోటా కింద 450 ఉద్యోగాలు ఒక్కొక్క ఉద్యోగం 15 లక్షలకు మీరు అమ్ముకున్నది నిజం కాదా? 4.కోర్టు మెరిట్ లిస్టు ఇవ్వమన్నా మీరు ఎందుకు స్పందించడం లేదు? 5. మేము మెగా డీఎస్సీ లో జరిగిన అవకతవకలపై సిబిఐ ఎంక్వయిరీ అడుగుతున్నా మీరు ఎందుకు వెనుకంజ వేస్తున్నారు? అని కూటమి ప్రభుత్వంపై సూటి ప్రశ్నలు సంధించారు. లోకేష్ విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత విద్యాశాఖను పూర్తిగా భ్రష్టు పట్టించారని , మీ కూటమి ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలైనా గత వైసిపి హయాంలో జగన్మోహన్ రెడ్డి నాడు నేడు కింద ప్రారంభించిన పనులను ఎందుకు పూర్తి చేయలేకపోయారని, ఉదాహరణకు నరసరావుపేట లోని మున్సిపల్ హైస్కూల్లో 2000 మంది విద్యార్థిని విద్యార్థులు చదువుతున్నారని ,గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన పనులను ఇంతవరకు ఎందుకు పూర్తి చేయలేకపోయారని ప్రశ్నించారు? ఇది మీ చేతకానితనం కాదా? అని ప్రశ్నించారు! ఫీజు రీయింబర్స్మెంట్ చెల్లించకపోవడం వల్ల విద్యార్థులను కళాశాలలు పరీక్షలు రాయనియకుండా, హాల్ టికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని ,గత అసెంబ్లీ సమావేశాల్లో 1600 కోట్లు ఇస్తామని చెప్పినప్పటికీ ఇంతవరకు ఎందుకు చెల్లించలేదని ప్రశ్నించారు? లోకేష్ కి అన్ని శాఖలు కావాలని ,కానీ ఆయన శాఖలో మాత్రం అభివృద్ధి శూన్యమని, విద్యావ్యవస్థలో జగన్మోహన్ రెడ్డి చేసిన సంస్కరణ వల్ల ఈరోజు టెన్త్ క్లాస్ పరీక్షల్లో వేలాది మంది విద్యార్థులకు 500 మార్కులు దాటాయని, అది కేవలం వైఎస్ జగన్మోహన్ రెడ్డి గొప్పతనం అని తెలియజేస్తూ... మహానాడు అట్టర్ ఫ్లాప్ అయిందని ఒక్కొక్క వేదికలో 11 మంది 15 మంది 20 మంది తప్ప ప్రజలు ఎవరు ఈ మహానాడులో పాల్గొనలేదని, ఇది వాస్తవం అని, ఇది పూర్తిగా విఫలమైన ప్రభుత్వం అని ,మహానాడు ద్వారా అర్థమవుతుందని ,రాబోయే ఎన్నికల్లో వైయస్ జగన్మోహన్ రెడ్డి విజయం సాధించడం ఖాయమని, ప్రజలు తిరిగి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోబోతున్నారని తెలియజేశారు ఈ కార్యక్రమంలో విద్యార్థులు ,వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.




# ఈవిఎం గోడౌన్ ను తనిఖీ చేసిన జిల్లా ఇంచార్జి కలెక్టరు సంజన సింహా




**నరసరావుపేట మే29 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** స్థానిక నరసరావుపేటలో మార్కెట్ యార్డ్ నందు ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగు మిషన్ల గోడౌన్ ను జిల్లా ఇంచార్జి కలెక్టరు సంజన సింహా శుక్రవారం తనిఖీ చేశారు. ఈవియం గోడౌన్ వద్ద సిసి కెమేరాలతో ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లను ఈవియం యంత్రాలు బి.యులు, సియులు, వివిప్యాట్ లను, అక్కడి భద్రతా ఏర్పాట్లను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. అనంతరం పరిశీలన రిజిస్టరులో సంతకం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు మేరకు ఈవీఎం గోడౌన్ తనిఖీలో భాగంగా ఈవియం గోడౌన్ కు వేసిన భద్రతా సీళ్లు, సిసి కెమేరాలు పనితీరు, అగ్నిమాపక దళ పరికరాలు, మొదలైనవి పరిశీలించారు. ఈ సందర్బంగా జిల్లా ఇంచార్జి కలెక్టరు మాట్లాడుతూ భారతీయ ఎన్నికల సంఘం ఆదేశాలు మేరకు ఈవియం గోడౌన్ కు పటిష్ట భద్రత కల్పించామన్నారు. ఎప్పటి కప్పుడు గౌడౌన్ ను క్షుణంగా తనిఖీ చేసి ఎన్నికల సంఘూనికి నివేదిక పంపిస్తున్నామన్నారు. ఈవియం గోడౌన్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇంచార్జి కలెక్టరు ఆదేశించారు.

# విజయవాడ బ్యాంక్‌లో షార్ట్ సర్క్యూట్: తప్పిన ప్రమాదం




**విజయవాడ , మే29 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** విజయవాడ నగరంలోని ఎంజీ రోడ్డు సమీపంలో ఉన్న కోస్టల్ ఏరియా బ్యాంక్‌లోఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్ సంభవించింది. ప్రమాదం జరిగిన వెంటనే బ్యాంక్ ప్రాంగణంలో దట్టమైన పొగలు అలుముకున్నాయి. దీంతో స్మోక్ అలారం మోగడంతో సిబ్బంది అప్రమత్తమయ్యారు.సమయస్ఫూర్తితో వ్యవహరించిన బ్యాంక్ ఉద్యోగులు వెంటనే కరెంటు మెయిన్స్ ఆఫ్ చేశారు. అనంతరం ఈ ప్రమాదంపై బ్యాంక్ మేనేజర్‌కు, ఫైర్ ఇంజిన్ సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకునే లోపే సిబ్బంది అప్రమత్తతతో పెద్ద ప్రమాదం తప్పింది. అయితే, ఈ షార్ట్ సర్క్యూట్ సంభవించడానికి గల ఖచ్చితమైన కారణాలు ఇంకా తెలియాల్సి ఉందని అధికారులు పేర్కొన్నారు.

# విజయవాడ దుర్గమ్మ గుడిలో చీరల వివాదం

## : ఈవో మౌనంపై అనుమానాలు



**విజయవాడ , మే29 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** విజయవాడ:ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మ అమ్మవారి అలంకరణ చీరల వ్యవహారం తీవ్ర వివాదానికి దారితీసింది. ఏడాదికి రూ.10 కోట్లకు చీరల విక్రయ టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్, భక్తులు సమర్పించే కానుకల చీరలను పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా కాంట్రాక్టర్ తన మనుషులకు ఐడీ కార్డులు ఇచ్చి మరీ గర్భగుడిలో ఉంచడంపై పాలకమండలి సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.అత్యంత పవిత్రమైన అంతరాలయంలోకి బయటి వ్యక్తులను ఎలా అనుమతిస్తారని వారు ప్రశ్నిస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఆలయ ఈవో (జూ) మౌనంగా ఉండటంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అమ్మవారి చీరల మాయంపై విచారణ జరపాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు

# కొత్తపేటలో ఘోర ప్రమాదం

## : విద్యుత్ తీగ తెగిపడి హోంగార్డు దుర్మరణం



**విజయవాడ , మే29 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** కొత్తపేట: అకాల వర్షం, ఈదురు గాలుల కారణంగా కొత్తపేటలో ఘోర ప్రమాదం జరిగింది. స్థానిక పోలీస్ స్టేషన్‌లో పనిచేసే హోంగార్డు జానీ బక్రీద్ పండుగ సెలవులో ఉండి, గురువారం తన సొంత ఆటోలో భార్యతో కలిసి ఇంటికి తిరిగి వస్తుండగా ఈ విషాదం చోటుచేసుకుంది. కొత్తపేట పోలీస్ స్టేషన్ సమీపంలో భారీ గాలివాన కారణంగా ఒక్కసారిగా విద్యుత్ తీగ తెగి వారు ప్రయాణిస్తున్న ఆటోపై పడింది. దీంతో తీవ్ర విద్యుత్ షాక్‌కు గురై జానీ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఆయన భార్య తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. సెలవుపై వెళ్లిన సహోద్యోగి ఇలా అకాల మరణం చెందడంతో పోలీస్ సిబ్బంది, స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు.

# న్యాయవాదులపై దాడులకు నిరసనగా కోర్టు విధుల బహిష్కరణ




**తాడేపల్లిగూడెం మే29 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఇటీవల ఏలూరులో న్యాయవాదులు పి. రమేష్, పి. పుల్లయ్యలపై జరిగిన దాడులను నిరసిస్తూ న్యాయవాదులు కోర్టు విధులను శుక్రవారం బహిష్కరించారు. సమాజంలో శాంతిభద్రతలను కాపాడే న్యాయవాదులపై దాడులు జరగడం దారుణమని, ప్రభుత్వం తక్షణమే స్పందించి న్యాయవాదులకు ప్రత్యేక రక్షణ కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ నిరసనలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొవ్వూరి అప్పిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కంకట శ్రీనివాసరావు, స్పోర్ట్స్ సెక్రటరీ శ్రీనుబాబు, వెంకట రామకృష్ణ, లోకేష్‌లతో పాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

# ఎండవేడికి ఉపశమనం పొందిన నగర ప్రజలు

## మామిడి రైతుల విలవిల.

## పలుచోట్ల చెట్లు కరెంటు స్తంభాలు నేలమట్టం.



**మచిలీపట్నం మే29 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** నగరంలో గురువారం అర్ధరాత్రి ఎదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దాదాపు గంటకు పైగా కురిసిన వర్షం వల్ల నగర ప్రజలకు ఎండ వేడి నుండి ఉపశమనం కలిగింది. కృష్ణా జిల్లాలో అకాల వర్షం వల్ల పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం కలిగింది. వర్ష బీభత్సం మామిడి రైతులకు తీవ్ర నష్టం కలిగించింది. లి గత కొన్ని రోజులుగా సూర్యుడి ప్రభావంతో మండుతున్న ఎండలతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలకు గురువారం రాత్రి కురిసిన భారీ వర్షం కొంత ఉపశమనాన్ని కలిగించింది. అయితే ఈ అకాల వర్షం మరోవైపు ప్రజలకు, రైతులకు తీవ్ర ఇబ్బందులను మిగిల్చింది. మచిలీపట్నం లో రోడ్లు జలమయం అయ్యాయి. అవనిగడ్డ, పామర్రు, గుడివాడ, గన్నవరం తదితర ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షంతో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకూలడంతో విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడింది. మామిడి రైతుల ఆశలపై నీళ్లు చల్లినట్లుఅయింది. ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, కారు యజమానులు, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే తీవ్ర వేసవి తాపంతో అలసిపోయిన ప్రజలు మాత్రం వర్షం వల్ల వాతావరణం చల్లబడటంతో కొంత ఊరట పొందారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తమై విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చర్యలు చేపట్టారు.

# సాంఘిక సంక్షేమ శాఖలో రాష్ట్ర స్థాయి ఉత్తమ అధికారిగా షేక్ షాహిద్ బాబు కి అవార్డు



**మచిలీపట్నం మే29 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** నిరంతరం అలుపెరుగని శ్రామికునిలా, వృత్తినే దైవంగా భావించే జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాష్ట్రస్థాయి ఉత్తమ అధికారిగా రాష్ట్ర ప్రభుత్వం చేతుల మీందుగా అవార్డు అందుకున్నారు. ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్, ఎస్ఎస్‌సీ ఫలితాల్లో కృష్ణా జిల్లా సాంఘిక సంక్షేమ శాఖకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించడంతో, ఆ విజయానికి విశేష కృషి చేసిన షేక్ షాహిద్ బాబు కి ఈ అవార్డు దక్కడం పట్ల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ గా కృష్ణా జిల్లాకి సంబంధించి రాష్ట్ర స్థాయి ఉత్తమ అధికారి అవార్డు షాహిద్ బాబు కి ప్రదానం చేశారు. ఈ విద్యా సంవత్సరం సాంఘిక సంక్షేమ శాఖ పాఠశాలల్లో విద్యార్థుల విద్యా ప్రగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ కిందిస్థాయి అధికారులను సిబ్బందిని అప్రమత్తం చేశారు. విద్యార్థులలో విద్యా ప్రమాణాల పెంపుకు విశేష కృషి చేశారు. అంతేగాక తరచూ సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్ లను పర్యవేక్షించి విద్యార్థులకు ఉన్న స్థితి నుండి ఉన్నత స్థితికి ఎలా ఎదగాలి అనేది ఉద్బోధించారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులకు అదనపు శిక్షణా తరగతుల నిర్వహణకు కృషి చేశారు. సాంఘిక సంక్షేమ శాఖ వార్డెన్లకు, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారులకి, సోషల్ వెల్ఫేర్ అధికారులకి, సిబ్బందికి ఎప్పటికప్పుడు సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ విద్యార్థుల విద్యా ప్రగతిని తెలుసుకుంటూ వారి విద్యా పురోభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. వీరి కృషికి గుర్తింపుగా ప్రభుత్వం ఉత్తమ అధికారిగా అవార్డు ప్రకటించడం పట్ల జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్స్ వార్డెన్లు, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారులు, సోషల్ వెల్ఫేర్ అధికారులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి బాల వీరాంజనేయ స్వామి, సాంఘిక సంక్షేమశాఖ ప్రధాన కార్యదర్శి ఎం.ఎం. నాయక్, డైరెక్టర్ లావణ్య వేణి , ఏపీ ఎస్ డబ్ల్యు ఆర్ ఎస్ కార్యదర్శి ప్రసన్న వెంకటేష్ పలువురు ఉన్నతాధికారులు షేక్ షాహిద్ బాబును అభినందించి, వారు చేసిన సేవల్ని కొనియాడారు. విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపు, ఉత్తమ ఫలితాల సాధనకు షాహిద్ బాబు చేసిన కృషిని ప్రశంసించారు.

# పాటలు వాడినందుకు 400 కోట్లు కట్టాలా?



ప్రస్తుతం బాలీవుడ్ దృష్టంతా నెక్స్ట్ బిగ్ రిలీజ్ 'హై జవానీతో ఇష్క్ హోనా హై' మీదే ఉంది. వరుణ్ ధావన్ హీరోగా మృణాల్ ఠాకూర్, పూజా హెగ్డే కథానాయికలుగా సీనియర్ దర్శకుడు డేవిడ్ ధవన్ రూపొందించిన చిత్రమిది. భర్త, భార్య.. మధ్యలో ప్రేయసి.. ఈ తరహా ఎంటర్టైన్మెంట్ కథతో తెరకెక్కిక చిత్రమిది. జూన్ 5న రాబోతున్న ఈ సినిమాపై మంచి అంచనాలే ఉన్నాయి. దీని ప్రోమోలు, పాటలు అన్నీ జనాల్లోకి సినిమాను బాగానే తీసుకెళ్లాయి. మంచి ఎంటర్టైనర్ అవుతుందనే అంచనాలున్నాయి ఈ చిత్రం మీద. కానీ విడుదల ముంగిట ఈ సినిమాకు పెద్ద షాక్ తగిలింది. ప్రముఖ నిర్మాణ సంస్థ పూజా ఎంటర్టైన్మెంట్స్ ఏకంగా రూ.400 కోట్లకు ఈ చిత్ర మేకర్స్ మీద దావా వేయడం బాలీవుడ్లో చర్చనీయాంశంగా మారింది. తమ సంస్థలో తెరకెక్కిన ఐకానిక్ హిట్ మూవీ 'బీవీ నంబర్ 1' నుంచి బాగా పాపులర్ అయిన పాటలను, లిరిక్స్‌ను తమ అనుమతి లేకుండా వాడుకున్నారంటూ ఆ సంస్థ లీగల్ యాక్షన్‌కు రెడీ అయింది. తమకు రూ.400 కోట్ల డబ్బులు చెల్లించడమే కాక.. ఈ పాటలను సినిమా నుంచి తొలగించాలని, సినిమా టైటిల్ కూడా మార్చాలని ఆ సంస్థ డిమాండ్ చేసింది. ఒకవేళ దర్శకుడు డేవిడ్ ధావన్ ఈ డిమాండ్లను పట్టించుకోకపోతే ఇంకో రూ.100 కోట్లు అదనంగా పరిహారం చెల్లించాలని ఆ సంస్థ స్పష్టం చేసింది. ఐతే అనుమతి లేకుండా పాటలు వాడుకుంటే.. మరీ వందల కోట్ల నష్టపరిహారం కోరడమేంటి అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. సాధారణంగా ఇలాంటి పాత పాటలను ఒక మాట చెప్పి వాడేసుకుంటూ ఉంటారు. అలా చెప్పని పక్షంలో వార్నింగ్ ఇస్తుంటారు. కానీ పూజా ఎంటర్టైన్మెంట్స్ సంస్థ మరీ ఈ స్థాయిలో డిమాండ్లు చేయడం చర్చనీయాంశం అయింది. పూజా సంస్థకు 'బడేమియా చోటేమియా' సహా కొన్ని సినిమాల వల్ల భారీ నష్టాలు వాటిల్లాయి. ఆ నష్టాలన్నింటినీ ఇలా భర్తీ చేసుకోవాలనుకుంటున్నారా అంటూ కౌంటర్లు వేస్తున్నారు నెటిజన్లు.




## జగపతికి సుకుమార్ ఇచ్చిన షాక్



విలన్, క్యారెక్టర్ పాత్రల్లోకి మారాక జగపతి బాబుకు 'ది బెస్ట్' అనదగ్గ రోల్స్ ఇచ్చిన దర్శకుల్లో సుకుమార్ ఒకరు. 'నాన్నకు ప్రేమతో'లో కృష్ణమూర్తి అనే స్టైలిష్ విలన్ పాత్రలో జగపతి ఎంతగా మెప్పించారో.. 'రంగస్థలం'లో ప్రెసిడెంట్ పాత్రలో అంతకుమించి ఆకట్టుకున్నారు. 'పుష్ప' సినిమాలో సైతం ఆయన పాత్రకు మంచి రెస్పాన్సే వచ్చింది. తనకు ఎంతో నచ్చిన దర్శకుల్లో సుకుమార్ ఒకడని చెబుతూ.. ఆయన చిన్న చిన్న విషయాలను కూడా ఎంతగా పట్టించుకుంటారో, ఎంత సూక్ష్మ పరిశీలన ఉంటుందో ఒక ఇంటర్వ్యూలో వెల్లడించాడు జగపతిబాబు. 'పుష్ప' సినిమాలో తాను చేసిన సెంట్రల్ మినిస్టర్ పాత్ర కోసం డబ్బింగ్ చెప్పాక, ఎలా ఉందో వినమంటూ వాయిస్ మెసేజ్ పంపాడట జగపతిబాబు. ఐతే అది వినగానే కూర్చుని వద్దు, నిలుచుని, నడుస్తూ డబ్బింగ్ చెప్పండి అంటూ మెసేజ్ ఇచ్చాడట సుకుమార్. తాను కూర్చుని డబ్బింగ్ చెప్పిన విషయం సుకుమార్‌కు ఎలా తెలిసిందా అని తాను షాకైపోయానని.. సుకుమార్ అబ్జర్వేషన్ ఎలా ఉంటుందో చెప్పడానికి ఇది ఉదాహరణ అని జగపతి చెప్పాడు. డబ్బింగ్ థియేటర్లో నడవడానికి అవకాశం ఉండదని.. దీంతో ఒక మైక్ తీసుకుని బయట నడుస్తూ తన వాయిస్ రికార్డ్ చేయించానని జగపతి వెల్లడించాడు. సుకుమార్ లాగే ఆయన శిష్యుడు బుచ్చిబాబు సైతం డబ్బింగ్ విషయంలో చాలా స్ట్రిక్ట్‌గా ఉంటాడని.. 'పెద్ది'లో అప్పల సూరి పాత్రకు డబ్బింగ్ చెప్పడానికి తన కెరీర్లో ఎన్నడూ పడనంత కష్టం పడ్డానని జగపతి చెప్పాడు. ఈ పాత్ర భాష, యాస చాలా భిన్నంగా ఉంటాయని.. వాటిని పట్టుకుని, పాత్రలోని ఎమోషన్‌కు తగ్గట్లు డబ్బింగ్ చెప్పడం చాలా కష్టమైందని.. రోజు మొత్తంలో రెండే రెండు డైలాగులు డబ్బింగ్ చెప్పిన సందర్భం కూడా ఉందని ఆయన చెప్పారు. తన కెరీర్లో ది బెస్ట్ క్యారెక్టర్లలో అప్పలసూరి ఒకటని ఆయనన్నారు.

## హృతిక్ తో రజిని సినిమా గుర్తుందా.. ఇప్పుడు జైలర్ 2?



సూపర్ స్టార్ రజినీకాంత్, దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ కలయికలో తెరకెక్కుతున్న జైలర్ 2 విడుదల తేదీ ఇప్పటిదాకా ఖరారు కాలేదు. ముందుగా ప్లాన్ చేసుకున్న ప్రకారం అయితే ఆగస్ట్ 14 రావాలి. కానీ ఇంకా షూటింగ్ కొంచెం బ్యాలన్స్ ఉండటంతో పాటు పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలకు ఎక్కువ సమయం అవసరం కావడంతో మళ్ళీ వాయిదా వేశారు. ఇది పక్కాగా తెలుసుకున్న తర్వాతే సూర్య విశ్వనాథ్ అండ్ సన్స్ ఆ తేదీని అధికారికంగా లాక్ చేసుకుంది. జైలర్ 2 ప్రధాన సమస్య క్యామియోలు. శివ రాజ్ కుమార్ తో ఇబ్బంది రాలేదు కానీ ఈసారి కొత్త అతిథులను తీసుకురావాలన్న ఉద్దేశంతో ముందు బాలకృష్ణని ట్రై చేశారు. రజనితో ఎంత అనుబంధం ఉన్నా ఇప్పుడున్న పరిస్థితుల్లో అది చేయలేనని సున్నితంగా నో చెప్పారు. తర్వాత షారుఖ్ ఖాన్ ఆల్మోస్ట్ ఫిక్స్ అన్నారు. గతంలో రా వన్ లో రజిని చిన్న క్యామియో చేశారు కాబట్టి ఆ ఋణం తీర్చుకుంటారని అనుకున్నారు. కానీ కింగ్ షూట్ వల్ల డేట్స్ దొరకలేదు. ఇప్పుడు హృతిక్ రోషన్ కోసం ట్రై చేస్తున్నట్టు చెన్నై టాక్. సరిగ్గా నలభై సంవత్సరాల క్రితం 1986లో రజనీకాంత్ హీరోగా భగవాన్ దాదా వచ్చింది. అందులో చైల్డ్ ఆర్టిస్ట్ గా హృతిక్ నటించాడు. అతని తండ్రి రాకేష్ రోషన్ నిర్మాత ప్లస్ మరో ముఖ్య పాత్ర పోషించాడు. తర్వాత మళ్ళీ ఈ కలయిక సాధ్యం కాలేదు. ఇప్పుడు నిజంగా అడిగితే హృతిక్ చేస్తాడా చేయడానే దాని గురించి సినీ వర్గాలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఎందుకంటే గెస్ట్ రోల్స్ అంటే హృతిక్ సుముఖత చూపడు. ఈ లెక్కన వినాయక చవితికి మాత్రమే జైలర్ 2 వచ్చే ఛాన్స్ ఉంది. ముత్తువేల్ పాండియన్ జైలర్ కాక ముందు ఏం చేశాడనే ఎపిసోడ్స్ లో పైన చెప్పిన ప్రత్యేక పాత్రలు వస్తాయట. ఇది పూర్తి చేయగానే నెల్సన్ దిలీప్ కుమార్ కు ఇంకో పెద్ద బాధ్యత ఉంది. కమల్ హాసన్ -- రజనీకాంత్ మల్టీస్టారర్ ని తెరకెక్కించాలి. ఈ ప్రాజెక్టు పరంగా తను చాలా ఒత్తిడి ఎదురుకోబోతున్నాడు. ఇద్దరు దర్శకులు మారాక తన చేతికి వచ్చింది. జైలర్ 2 పెద్ద విజయం సాధిస్తే దానికి మరింత ఊపొస్తుంది.

## పైరసీని ఆపితే ప్రపంచాన్ని జయించినట్టే



వచ్చే వారం విడుదల కాబోతున్న పెద్దికి మదరాస్ హైకోర్టు యాంటీ పైరసీ ఇంజక్షన్ రక్షణ కల్పించింది. అంటే ఎవరైనా ఈ సినిమాని పైరసీ చేసి వెబ్ సైట్స్ లో పెట్టినా, ఎక్కడైనా యాప్స్ లేదా ఆన్ లైన్ ద్వారా రవాణా చేసినా వెంటనే కట్టడి చేసే స్వతంత్రం నిర్మాణ సంస్థకు ఉంటుంది. అంటే ఉదాహరణకు ఫలానా ఏబిసి సైట్ లో ఎవరో పెద్ది అప్లోడ్ చేశారనుకుందాం. న్యాయస్థానం ఆదేశాల ప్రకారం ఎలాంటి అనుమతులు అవసరం లేకుండా ఇంటర్ నెట్ సర్వీస్ ప్రొవైడర్లు వాటిని తక్షణం తీసేయాలి. ఇది నిజంగా ఫలితం ఇస్తే ప్రపంచాన్ని జయించినట్టే. ఎందుకంటే ఎన్ని చర్యలు తీసుకున్నా దశాబ్దాలుగా ఇండస్ట్రీని పైరసీ భూతం వదల్లేదు. ఆ మధ్య తమిళనాడు సీఎం విజయ్ జన నాయగన్ హఠాత్తుగా హెచ్డిలో లీకై కోలీవుడ్ ని కుదిపేసింది. నిర్మాణ సంస్థ సకాలంలో స్పందించి అన్నీ తీయించేసినా అప్పటికే లక్షల్లో జనాలు చూసేశారు. అంతకు ముందు తండేల్, హిట్ 3, గేమ్ ఛేంజర్ లాంటి ఎన్నో కొత్త సినిమాలు ఈ రాకాసి బారిన కోట్ల రూపాయల నష్టం చవి చూశాయి. ఇప్పుడు పెద్ది వంతు వచ్చింది. నిర్మాత ఈ సవాల్ ని ఎలా ఎదురుకుంటారో చూడాలి. ఒకవేళ సక్సెస్ అయితే ఇతర ప్రొడ్యూసర్లకు కూడా దారి దొరికినట్టు అవుతుంది. ఎందుకంటే జూన్ నుంచి వరసగా మంచి కంటెంట్ ఉన్న పెద్ద సినిమాలు క్యూలో ఉన్నాయి. లెనిన్, ప్యారడైజ్, విశ్వనాథ్ అండ్ సన్స్, జైలర్ 2, విశ్వంభర, స్వయంభు,భోగి లాంటివి భారీ అంచనాలతో థియేటర్లకు వస్తున్నాయి. వీటికి కూడా ఇంజక్షన్ ఆర్డర్స్ లాంటివి చాలా అవసరమవుతాయి. రవి అరెస్ట్ కాగానే ఐబొమ్మ అంతరించిపోయిదనుకున్న టైంలో ఇటీవలే మళ్ళీ రీ ఎంట్రీ ఇవ్వడం పోలీసులను సైతం షాక్ కు గురి చేసింది. బెయిలు మీద బయటికి వచ్చిన రవి తనకు సంబంధం లేదని చెబుతున్నా ఇన్వెస్టిగేషన్ అయితే జరుగుతోంది. పెద్ది మీద వందల కోట్ల థియేటర్ బిజినెస్ జరిగింది. రికవరీ జరగాలంటే అద్భుతమైన టాక్ తో పాటు పైరసీ ని అణిచివేయాలి. ఇందులో ఎంతవరకు సఫలీకృతమవుతారో ఇంకొద్ది రోజులు ఆగితే క్లారిటీ వస్తుంది.



# బిజినెస్ న్యూస్




## అందుకే.. ఒక్కసారిగా పెరిగిన గోల్డ్ రేటు!



బంగారం ధరల తగ్గుదలకు బ్రేక్ పడింది. ఈ రోజు (మే 29) గోల్డ్ రేటు ఒక్కసారిగా పెరిగింది. ఉన్నట్టుండి పసిడి ధరలు పెరగడానికి కారణాలు ఏమిటనేది ఈ కథనంలో తెలుసుకుందాం. బంగారం ధరల పెరుగుదలకు ప్రధాన కారణం.. అమెరికా-ఇరాన్ కాల్పుల విరమణ ఒప్పందం కుదిరే అవకాశం ఉందన్న వార్తలు. ద్రవ్యోల్బణం, అమెరికా వడ్డీ రేట్ల పెంపుపై కొనసాగుతున్న ఆందోళనలు కూడా పసిడి ధరలపై ప్రభావం చూపించిందని న్యూస్ ఏజెడ్ తన నివేదికలో వెల్లడించింది. మార్కెట్ వివరాల ప్రకారం.. స్పాట్ గోల్డ్ ధర 0.3 శాతం పెరిగి ఔన్స్‌కు సుమారు 4,505.57 డాలర్లకు చేరింది. అదే సమయంలో అమెరికా గోల్డ్ ఫ్యూచర్స్ కూడా పెరిగి 4,535.90 డాలర్ల వద్ద ట్రేడ్ అయ్యాయి. గోల్డ్‌సిల్వర్ సెంట్రల్ మేనేజింగ్ డైరెక్టర్ బ్రియాన్ లాన్ ప్రకారం.. కాల్పుల విరమణ ప్రకటన రాకముందు ధరలు ఇంకా పడిపోతాయని భావించారు. కానీ అమెరికా-ఇరాన్ మధ్య ఒప్పందాలకు సంబంధించిన వార్తలు బయటకు రావడంతో రలు ఒక్కసారిగా పెరిగాయి. ప్రస్తుతం మార్కెట్ పరిస్థితి చాలా అస్థిరంగా ఉందని ఆయన పేర్కొన్నారు. అమెరికా-ఇరాన్ మధ్య ఒప్పందం ప్రకారం హోర్ముజ్ జలసంధి ద్వారా షిప్పింగ్‌పై ఉన్న ఆంక్షలను సడలించే అవకాశం ఉంది. ఇది ప్రపంచ చమురు మరియు వాణిజ్య రవాణాపై కూడా ప్రభావం చూపుతుంది. అయితే.. ఈ ఒప్పందం ఇంకా పూర్తిగా ఫైనల్ కాలేదు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆమోదం ఇంకా రావాల్సి ఉంది. అదే.. సమయంలో ఇరాన్ ప్రభుత్వ మీడియా కూడా ఈ ఒప్పందం పూర్తిగా ఖరారు కాలేదని తెలిపింది.

## 'శాంతి'పై అనిశ్చితి.. సెన్సెక్స్ 1092 పాయింట్లు డౌన్



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. ఉదయం స్వల్ప లాభాల్లో ప్రారంభమైన సూచీలు.. మధ్యాహ్నం వరకు స్వల్ప లాభాల్లో ట్రేడయ్యాయి. ఆఖర్లో అమ్మకాల ఒత్తిడితో భారీ నష్టాల్లోకి జారుకున్నాయి. అమెరికా- ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం విషయంలో అనిశ్చితి, ఎఫ్ఐఐల విక్రయాలు కొనసాగుతుండటం సూచీలపై ప్రతికూల ప్రభావం చూపింది. దీంతో సెన్సెక్స్ ఇంట్రాడే గరిష్ఠాల నుంచి 1300 పాయింట్ల మేర నష్టపోగా.. నిఫ్టీ 23,550 దిగువన ముగిసింది. మదుపర్ల సంపద రూ.5 లక్షల కోట్లు క్షీణించి రూ.466 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 75,988.51 (క్రితం ముగింపు 75,867.80) పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడే 76,220.02 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. ఆఖర్లో అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొంది. దీంతో 74,589.11 పాయింట్ల వద్ద కనిష్ఠానికి చేరింది. చివరికి 1092.06 పాయింట్ల నష్టంతో 74,775.74 వద్ద ముగిసింది. నిఫ్టీ 359.40 పాయింట్ల నష్టంతో 23,547.75 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.05గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఎల్అండ్‌టీ, ఇన్ఫోసిస్ షేర్లు మిగిలిన షేర్లు నష్టపోయాయి. పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఇండిగో, ఎన్టీపీసీ, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా స్టీల్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 91.40 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4530 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

కారణాలు ఇవీ..

అమెరికా – ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం విషయంలో ఇంకా స్పష్టత రాకపోవడం స్టాక్ మార్కెట్ నష్టానికి ప్రధాన కారణం. అమల్లో ఉన్న కాల్పుల విరమణ పొడిగింపు, అణు కార్యక్రమంపై చర్చలను ప్రారంభించేందుకు అమెరికా, ఇరాన్ ప్రతినిధులు ఓ తాత్కాలిక ఒప్పందానికి చేరువైనా.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దీనికి ఆమోదం తెలపాల్సి ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ఓ వైపు చర్చలు జరుపుతూనే మరోవైపు ఇరు దేశాలు దాడులు, ప్రతీకార దాడులకు దిగుతుండడం మదుపర్లను ఆందోళనకు గురిచేస్తోంది. దీంతో వారాంతంలో స్టాక్ మార్కెట్‌పై ఆ ప్రభావం పడింది.

దేశీయ ఈక్విటీ మార్కెట్‌ల నుంచి విదేశీ మదుపర్ల తరలిపోవడమూ సెంటిమెంట్‌ను దెబ్బతీస్తోంది. బుధవారం రూ.1040 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను విక్రయించారు. 2025 ఏడాది పొడవునా విక్రయించిన దానికంటే ఎక్కువగా ఈ ఏడాది ఇప్పటికే పెద్ద మొత్తంలో ఈక్విటీ షేర్లను విదేశీ మదుపర్లు విక్రయించడమూ ప్రతికూల ప్రభావం చూపింది.

ఈ సారి వర్షాకాలం సీజన్‌లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు కావొచ్చన్న వాతావరణ శాఖ అంచనాలు కూడా స్టాక్ మార్కెట్ నష్టాలకు కారణమయ్యాయి.

## రూ.1.4 కోట్ల బిల్లు కస్టమర్లకు వాపస్!



వ్యాపారంలో లాభాల కంటే వినియోగదారుల నమ్మకమే ముఖ్యమని బార్బెక్యూ రెస్టారెంట్ తెలిపింది. తాము అందించిన ఆహారం సొంత నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా లేదని గ్రహించిన సదరు యాజమాన్యం.. ఏకంగా కస్టమర్లకు సుమారు రూ.1.4 కోట్లు (1,62,000 అమెరికన్ డాలర్లు / 1.1 మిలియన్ యువాన్లు) తిరిగి చెల్లించింది. కస్టమర్ల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకపోయినా సంస్థే స్వయంగా ముందడుగు వేసి ఈ నిర్ణయం తీసుకుంది. 'ది సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్' నివేదిక ప్రకారం.. చైనావ్యాప్తంగా 142 అవుట్‌లెట్లతో విస్తరించిన ప్రసిద్ధ బ్రాండ్ 'వెరీ లాంగ్ అగో లాంబ్ స్కేవర్స్' ఈ నిర్ణయాన్ని తీసుకుంది.


అసలేం జరిగింది? గ్రిల్లింగ్‌లో లోపమే కారణమా?

ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో కంపెనీకి చెందిన 24 అవుట్‌లెట్లలో దాదాపు 48,000 టేబుల్స్ వద్ద భోజనం చేసిన కస్టమర్లను రెస్టారెంట్ యాజమాన్యం ఈ నెల ప్రారంభంలో స్వయంగా సంప్రదించింది. అంతర్గత నాణ్యత సమీక్షలో ఒక షాకింగ్ నిజం బయటపడటమే దీనికి కారణం. ఆ సమయంలో కొత్తగా ప్రవేశపెట్టిన గ్రిల్లింగ్ పరికరాల్లో ఉష్ణోగ్రత స్థిరంగా లేకపోవడం వల్ల, మటన్ కబాబ్‌లు ఆశించిన స్థాయిలో గ్రిల్ కాలేదని కంపెనీ గుర్తించింది. కస్టమర్ల నుంచి అధికారికంగా ఎలాంటి ఫిర్యాదులు రానప్పటికీ తమ బ్రాండ్ విలువలకు కట్టుబడి సదరు మటన్ స్కేవర్ల ధరలో 50 శాతం మొత్తాన్ని ఖాతాదారులకు రీఫండ్ చేసింది.

నిజాయితీయా? మార్కెటింగ్ జిమ్మిక్కా?

ఈ భారీ వాపసు కార్యక్రమం నెట్టింట వైరల్‌గా మారడంతో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 'లాభాల కంటే కస్టమర్ల సంతృప్తికే ప్రాధాన్యతనిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించిన రెస్టారెంట్ నిజాయితీ అమోఘం' అని మెజారిటీ నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. అయితే, మరికొందరు మాత్రం ఇది బ్రాండ్ ఇమేజ్‌ను పెంచుకోవడానికి, పబ్లిసిటీ కోసం ప్లాన్ చేసిన ఒక తెలివైన మార్కెటింగ్ వ్యూహం కావచ్చునని సందేహం వ్యక్తం చేస్తున్నారు.

## టయోటా అర్బన్ క్రూయిజర్ ఎబెల్లా వచ్చేసింది.. సింగిల్ ఛార్జ్‌తో 543km



ప్రముఖ కార్ల తయారీ కంపెనీ టయోటా కిర్లోస్కర్ మోటార్ దేశంలో తొలి విద్యుత్ కారు అర్బన్ క్రూయిజర్ ఎబెల్లా (ఞశీఎఞ్ఞు ఖతీఝఱ జతీబఱంవతీ జుఎవశ్రీశ్రీఖ)ను లాంచ్ చేసింది. హ్యుందాయ్ క్రెటా ఎలక్ట్రిక్, ఎంజీ జడ్ఎస్, మారుతీ సుజుకీ ఇ-విటారాకు పోటీగా.. మిడ్ సైజ్ ఎస్‌యూవీ సెగ్మెంట్‌లో దీన్ని లాంచ్ చేసింది. మారుతీ సుజుకీ ఈ-విటారా ప్లాట్‌ఫామ్‌పై ఈ కారు రూపొందినప్పటికీ.. టయోటా డిజైన్ ఎలిమెంట్లను జోడించారు. దీని ధరను రూ.23.60 లక్షలుగా (ఎక్స్‌షోరూమ్) కంపెనీ నిర్ణయించింది. టయోటా అర్బన్ క్రూయిజర్ ఎబెల్లా రెండు బ్యాటరీ వేరియంట్లలో (49 ఐశ్ౌష్ట్ర, 61 ఐశ్ౌష్ట్ర) లభ్యమవుతుంది. అధిక బ్యాటరీ సామర్థ్యం కలిగిన వేరియంట్ సింగిల్ ఛార్జ్‌తో 543 కిలోమీటర్లు ప్రయాణిస్తుందని కంపెనీ పేర్కొంది. ఇందులో అమర్చిన మోటార్ 172 బీహెచ్‌పీ, 189 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది.

18 అంగుళాల అల్లాయ్ వీల్స్ ఇచ్చారు. ఐదు మోనోటోన్, నాలుగు డ్యూయల్ టోన్ ఎక్స్‌టీరియర్ కలర్ ఆప్షన్లతో ఈ కారు లభ్యమవుతుంది. క్యాబిన్ లోపల 10.25 అంగుళాల డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, 10.1 అంగుళాల ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్ ఇచ్చారు. ఇది వైర్‌లెస్ ఆండ్రాయిడ్ ఆటో, యాపిల్ కార్ ప్లేకు సపోర్ట్ చేస్తుంది.

పనోరమిక్ సన్‌రూఫ్, 12 కలర్ ఆప్షన్లతో కూడిన యాంబియెంట్ లైటింగ్, వెంటిలేటెడ్ ఫ్రంట్ సీట్స్ ఉన్నాయి. వైర్‌లెస్ ఫోన్ ఛార్జింగ్, జేబీఎల్ సౌండ్ సిస్టమ్, ఆటోమేటిక్ క్లయిమేట్ కంట్రోల్, మల్టిపుల్ యూఎస్‌బీ పోర్ట్స్ ఇచ్చారు. ఇన్-క్యాబిన్ ఎయిర్‌ప్యూరిఫైర్ సదుపాయం కూడా ఉంది. స్టాండర్డ్‌గా 7 ఎయిర్‌బ్యాగులు ఇస్తున్నారు. ఏబీఎస్, ఈబీడీ, ఈఎస్‌పీ, 360 డిగ్రీల కెమెరా, లెవల్-2 అడాస్ ఫీచర్లు ఉన్నాయి.

# వేర్వేరు కేసుల్లో ముగ్గురు అరెస్ట్ ...50 లక్షల చోరీ సొత్తు స్వాధీనం



## ఎస్పీ బిందు మాధవ్

**కాకినాడ, మే 29 (నేటి మనదేశమ్) :** జిల్లాలో వరుస చైన్ స్నాచింగ్‌లు, ఇంటి దొంగతనాలు, మోటార్ సైకిల్ చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను కాకినాడ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 50 లక్షల 16 వేల విలువైన బంగారం, వెండి వస్తువులు, నగదు, మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులకు సంబంధించి గురువారం జిల్లా ఎస్పీ జి బిందు మాధవ్ విలేకరులకు వివరాలను తన కార్యాలయంలో వెల్లడించారు. కాకినాడ-2 టౌన్, సర్పవరం, పిఠాపురం, ఇంద్రపాలెం, కోరింగ పోలీస్ స్టేషన్ల పరిధితో పాటు కోనసీమ జిల్లా దాక్షారామం లో నమోదైన 12 కేసులను పోలీసులు ఛేదించగా వీటిలో ఏడు చైన్ స్నాచింగ్‌లు, రెండు ఇంటి దొంగతనాలు, ఒక ఏటీఎం కార్డు మోసం, రెండు మోటార్ సైకిల్ చోరీ కేసులు ఉన్నాయన్నారు. చైన్ స్నాచింగ్ కేసుల్లో అరెస్టైన పల్లా సురేంద్ర కుమార్, రంగాల శ్రీనివాసరెడ్డి వద్ద నుంచి 320 గ్రాముల బంగారం, 600 గ్రాముల వెండి, 40 వేల నగదు, ఒక ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటి విలువ 46 లక్షల 50 వేల రూపాయలని ఎస్పీ చెప్పారు. మరో నిందితుడు రచ్చ నాగ సతీష్ కుమార్ అలియాస్ బబ్లు వద్ద నుంచి 430 గ్రాముల వెండి, మూడు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ 3 లక్షల 66 వేల వరకు ఉంటుందని చెప్పారు.నిందితులు ఒంటరిగా వెళ్తున్న మహిళలు, వృద్ధ మహిళలను లక్ష్యంగా చేసుకుని చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్నట్లు తెలిపారు. ఏటీఎంల వద్ద వృద్ధులకు సహాయం చేస్తున్నట్లు నటించి కార్డులు మార్చి నగదు దోచుకునే వారని పేర్కొన్నారు. తాళాలు వేసి ఖాళీగా ఉన్న ఇళ్లను గుర్తించి దొంగతనాలు చేయడం, బయట పార్క్ చేసిన మోటార్ సైకిళ్లను దొంగిలించడం వీరి నేర ప్రవృత్తి గా వెల్లడైందన్నారు. బంగారు గొలుసు దొంగతనాల ముద్దాయిలను గురువారం సామర్లకోట రోడ్ లోను, మోటార్ సైకిల్ దొంగతనం కేసులో ముద్దాయిని వలసపాకలలో అరెస్ట్ చేసినట్టు చెప్పారు. విహార యాత్రలకు ఇల్లు వదిలి దూర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు స్థానిక పోలీసులకు తెలియజేస్తే తాము వచ్చి ఎల్ హెచ్‌ఎంఎస్ అనే పరికరాన్ని అమర్చుతామని దానిని వినియోగికోవాలని ఎస్పీ సూచించారు.ఈ కేసులను ఛేదించిన ఏఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్, ఎస్బి డిఎస్పి కెవివి సత్యనారాయణ, సీసీఎస్ సీఐ వి కృష్ణ, కాకినాడ టూ టౌన్ సిఐ ఆర్ అప్పలనాయుడు, సామర్లకోట క్రైమ్ సీఐ ఆర్ అంకబాబు, కాకినాడ-2 టౌన్ ఎస్ఐ బుజ్జిబాబు, సర్పవరం ఎస్ఐ ఎం ఏసుబాబు, సిబ్బందిని జిల్లా ఎస్పీ బిందు మాధవ్ అభినందించారు.

# ఉరుములు మెరుపులతో పెనుగాలులు



- నేలకొరిగిన భారీ చెట్లు, విద్యుత్ స్తంభాలు
- నిలిచిపోయిన విద్యుత్ సరఫరా

**ముద్దనూరు, కడప, మే 29, నేటి మన దేశమ్ :** ఉరుములు, మెరుపులు భారీ ఈదురుగాలులతో కురిసిన వర్షం ధాటికి భారీ వృక్షాలు, కొమ్మలు నేలకొరిగాయి.వర్షం తక్కువ ఈదురు గాలులు ఎక్కువగా వీయ డంతో మండల వ్యాప్తంగా విద్యుత్ స్తంభాలు, చెట్లు,కొమ్మలు విరిగి పడ్డాయి. వందల ఏళ్ల నాటి చరిత్ర కలిగిన పెద్ద వేప చెట్టు సైతం కూలిపోయాయి. ఎన్నో ఏళ్లుగా ప్రయాణి కులకు నీడను ఇస్తున్న వేప చెట్టు వేర్లతో సహా నేల కొరిగింది. ముద్దనూరు పాత బస్టాండ్ కూడలిలో, రైల్వే గేటు సమీపంలో, రైల్వే స్టేషన్ వెళ్లే దారిలో చెట్ల కొమ్మలు విరిగి రోడ్డుపై పడ్డాయి. స్థానిక ఎల్ ఎమ్ కాంపౌండ్, ప్రాథమిక పాఠశాలలో పదుల సంఖ్యలో చెట్లు, కొమ్మలు విరిగి రోడ్లపై విద్యుత్ తీగలపై పడడంతో తీగలు తెగి రోడ్డుపై పడ్డాయి. రాత్రి నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు అంధకారంలో అల్లాడిపోయారు. రోడ్డుపై అడ్డుగా పడిన...

చెట్లను కాలనీ వాసులు సాయంతో విద్యుత్ అధికారులు తొలగించారు. విద్యుత్ ఎఇ శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది శుక్రవారం చెట్లు తొలగించి, విరిగిన స్తంభాలను పునరుద్ధరించి, తీగలు మరమ్మతులు చేపట్టి కరెంట్ సరఫరా చేశారు.

# రూ.కోటి విలువ చేసే బంగారం స్వాధీనం.. ఇద్దరు అరెస్ట్



**అమలాపురం, మే 29, నేటి మనదేశమ్ :** అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేటలో జరిగిన భారీ చోరీ కేసును పోలీసులు ఛేదించారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.కోటి విలువ చేసే బంగా రాన్ని స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం అమలాపురం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ రాహుల్ మీనా ఈ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. "పొన్నాడ రవిశంకర్, పైరా చిరంజీవి.. 2025లో ఓ ఇంట్లో బీరువాను పగులగొట్టి 646.361 గ్రాముల బంగారాన్ని ఎత్తుకెళ్లారు. దీనిపై కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో భాగంగా గురువారం ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రూ.కోటి విలువ చేసే బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు" ఎస్పీ తెలిపారు. పొన్నాడ రవిశంకర్‌పై 120 దొంగతనం కేసులు నమోదవగా.. చిరంజీవిపై ఓ హత్య కేసు కూడా ఉన్నట్లు ఎస్పీ చెప్పారు. కేసు ఛేదనలో కీలక పాత్ర పోషించిన పోలీసులను ఆయన అభినందించారు.

# ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి



**పి.గన్నవరం, మే 29, నేటి మనదేశమ్ :** పట్టుదలతో చదువుకుని జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ విద్యార్థులకు సూచించారు. నియోజకవర్గంలోని పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు పి. గన్నవరంలో సన్మాన కార్య క్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులను శాలువాలతో సత్కరించి, బ్యాగులు అందజేశారు.

భవిష్యత్‌లో బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

# యువతకు వాలీబాల్ కిట్లను అందజేసిన సిఐ శ్రీనివాసరావు



**కొయ్యూరు, మే 29, నేటి మనదేశమ్ :** మండలంలో, లోసం యువతకు, శుక్రవారం నాడు వాలీబాల్ కిట్లను, కొయ్యూరు సిఐ శ్రీనివాసరావు, మంప ఎస్ఐ ,శ్రీనివాస్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, శారీరక, మానసిక దృఢత్వానికి క్రీడలు ఎంతో తోడ్పడతాయని అన్నారు. సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లోని యువతను క్రీడల వైపు ప్రోత్సహించే ఉద్దేశంతో లూసం గ్రామ ప్రజలకు, యువతకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వాలీబాల్ కిట్‌ను అందజేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఐ మరియు ఎస్ఐలు మాట్లాడుతూ.. నేటి ఆధునిక కాలంలో ఒత్తిడిని జయించడానికి, ఆరోగ్యంగా ఉండటానికి ప్రతి ఒక్కరూ క్రీడలను తమ జీవితంలో భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు.యువత వ్యసనాలకు దూరంగా ఉండి, ఆటలపై దృష్టి సారించాలి. అని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో దాగున్న ప్రతిభను వెలికితీసేందుకు, పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ముందుంటుంది. తెలిపారు. ఈ వాలీబాల్ కిట్‌ను లూసం గ్రామ యువత సద్వినియోగం చేసుకుని, క్రీడల్లో రాణించాలని మంప ఎస్సై శ్రీనివాస్ కోరారు. యువతకు క్రీడా కిట్లను అందజేసినందుకు, గాను కొయ్యూరు పోలీసులకు, యువత, గ్రామస్తులు, అభినందనలు తెలిపారు..

# దప్పికతో పుట్టురు గ్రామం ..!



**పార్వతీపురం (మన్యం) (నేటి మనదేశమ్) :** పార్వతీపురం మన్యం జిల్లా పార్వతీపురం మండలం పుట్టురు గ్రామం దప్పికతో ఎండిపోతోంది. పార్వతీపురం మండలానికి కూతవేటు దూరంలో ఉన్న పుట్టూరు గ్రామంలో ఉన్న ప్రజలు తాగునీరుకి కష్టాలు పడుతున్నారు. శుక్రవారం ఆ గ్రామస్తులు ప్రజాశక్తికి తమ గోడు వెళ్లబోసుకున్నారు. తమ ఆవేదన అధికారులకు తెలియాలని విన్నవించుకున్నారు. చాలామంది పేద ప్రజలు బోరు బావి లేక, సొంతంగా ఖర్చు పెట్టి బోర్లు తీసుకోలేక తాగునీరు కోసం నానా కష్టాలు అవస్థలు పడుతున్నారు. పేరు గొప్ప, ఊరు దెబ్బ అనే సామెతగా తయారయింది ఆ ఊరు. నేటికీ ప్రభుత్వాలు మారినా తమ బతుకులు మారడం లేదని ప్రజలు అంటున్నారు. చాలా గ్రామాలలో ఇంటింటికి కొళాయిలు వేస్తున్నారు తప్ప తమ ఊరిలో వేయడం లేదని ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

# పదవ తరగతి విద్యార్థులకు
# కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ప్రోత్సాహక నగదు అందజేత



**భీమునిపట్నం, మే 29 మే నేటి మన దేశమ్ :** ఇటీవల వెలువడిన పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన భీమిలి మండలం లక్ష్మీపురం,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు చిట్టివలస గర్ల్స్ హైస్కూల్ లోని విద్యార్థులకు కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఆధ్వర్యంలో ప్రథమ బహుమతి 5000 ద్వితీయ బహుమతి 3000 తృతీయ బహుమతి 2500 చొప్పున ఈ రెండు పాఠశాలలకు కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామ్ తన నివాసంలో విద్యార్థిని విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీరామ్ విద్యార్థులను ఆశీర్వదిస్తూ ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు ఫౌండేషన్ ఎప్పుడూ చేయూతనిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో...

లక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయులు దంతంశెట్టి సత్యారావు మరియు చిట్టివలస గర్ల్స్ హైస్కూల్ ప్రధానో పాధ్యాయిని శివ జ్యోతి ఉపాధ్యాయులు రేఖ అప్పారావు ఊడి కల శ్రీనివాసరావు, రాంబాబు ఉదయ్ సావిత్రి, భీమా బాయ్, ప్రభావతి తదితర ఉపాధ్యాయులు, మరియు ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు

# రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో
# వన్ మంత్ వన్ విలేజ్ ఫోర్ విజిట్స్ కార్యక్రమం

**భీమునిపట్నం, మే 29 నేటి మనదేశమ్ :** భీమిలి మండలం టి.నగరపాలెం గ్రామ పంచాయతీలో గురువారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో నూతన కార్యక్రమం నిర్వహించారు.వన్ మంత్ వన్ విలేజ్ ఫోర్ విజిట్స్ అనే సరికొత్త కార్య క్రమం ప్రభుత్వ అధికారుల సమక్షంలో రైతులు యొక్క దీర్ఘకాలిక సమస్యలు ను పరిష్కరించుటకు రైతుల నుండి అర్జీలు స్వీకరించి నాలుగు వారాల్లో వాటికి పరిష్కారం చేయడానికి ఒక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఎమ్మార్వో పి.రామారావు, డిప్యూటీ తాహశిల్దార్ ప్రసాద్ , మండల సర్వేయర్ చిరంజీవి,మండల ఆర్ ఐ చంద్రశేఖర్, మండల అభివృద్ధి అధికారి పంచాయతీ అధికారి ప్రసాద్,పంచాయతీ రెవిన్యూ అధికారి పోతిన అప్పారావు,పోట్నూరు చంద్రశేఖర్, పోట్నూరు రాము లక్షణ్,తమ్మిన రాము పాత్రుడు,పూసర్ల రామారావు యాదవ్ మాజీ పంచాయతీ బోర్డు మెంబర్, పళ్ళ పోతురాజు, కోరాడ అప్పలనరసయ్య, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# విజయనగరంలో ముగిసిన
# రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలు
## విజయనగరం జిల్లాకు ఓవరాల్ ఛాంపియన్‌షిప్



**విజయనగరం, మే 29, నేటి మనదేశమ్ :** స్థానిక రాజీవ్ క్రీడా ప్రాంగణంలో మూడు రోజుల పాటు అత్యంత ఉత్సాహంగా జరిగిన 5వ ఏపీ కప్ స్టేట్ తైక్వాండో ఛాంపియన్‌షిప్-2026 పోటీలు గురువారం ఘనంగా ముగిశాయి. ఈ పోటీలలో ఆతిథ్య విజయ నగరం జిల్లా క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిచి ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో మే 5 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించిన ఈ పోటీల ముగింపు సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వేణుగోపాల్ రావు వివరాలను వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి సుమారు 600 మంది క్రీడాకారులు ఈ టోర్నీలో పాల్గొన్నారని, క్రీడాకారుల మధ్య నెలకొన్న పోటీతత్వం రాష్ట్ర తైక్వాండో స్థాయిని చాటి చెప్పిందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా క్యోరుగి విభాగంలో విజయనగరం జిల్లా 394 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి ఛాంపియన్‌గా అవతరించింది. విశాఖపట్నం జిల్లా 350 పాయింట్లతో ద్వితీయ స్థానాన్ని, తూర్పు గోదావరి జిల్లా 239 పాయింట్లతో తృతీయ స్థానాన్ని దక్కించుకున్నాయి. పూమ్సే విభాగంలో కృష్ణా జిల్లా 124 పాయింట్లతో ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచి తన ఆధిపత్యాన్ని చాటుకుంది. యువ క్రీడాకారుల్లో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణను పెంపొందించడమే లక్ష్యంగా ఈ పోటీలు నిర్వహించినట్లు వేణుగోపాల్ రావు తెలిపారు. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా క్రీడాకారులను తీర్చిదిద్దుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం విజయవంతానికి సహకరించిన అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు అచ్చం నాయుడు, కోశాధికారి నాయబ్ రసూల్, వివిధ జిల్లాల కార్యదర్శులు, కోచ్‌లు , క్రీడాకారుల తల్లిదండ్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు.

# ఇష్టారాజ్యంగా కూరగాయలు ధరలు



## పట్టించుకోని అధికారులు...

పత్తికొండ : సామాన్యుడికి కూరగాయలు కూడా అందని ద్రాక్షగా మారాయి. పత్తికొండలో కూరగాయల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా కూరగాయల ధరలు పెంచడంతో సామాన్య ప్రజలు కొనుగోలు చేయడానికి ఇబ్బంది పడుతున్నారు. రోజురోజుకు బహిరంగ మార్కెట్ లో కూరగాయల ధరలు కిలో టమోటా 50, పచ్చిమిరప 60, ఉర్ల గడ్డలు 40, బెండకాయ 40,క్యారెట్ 60,ముల్లంగి 60, ఎర్రగడ్డ 40, వంకాయ 50, క్యాబేజీ 60, పూతగడ్డ 40 ధరలు పెరిగాయి. కూరగాయల ధరలు పెరగడంతో పాటు పూట గడవడానికి ఇబ్బందిగా ఉందంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్లలో కూరగాయలు పండించే రైతుల కు గిట్టుబాటు ధర లభించడం లేదు. కూరగాయల నిర్వాహకులు ధరల పట్టిక ఏర్పాటు చేయకపోవడంతో పాటు ఇష్టారాజ్యంగా ధరల పెంచుతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. కూరగాయల నిర్వాహకులు, పర్యవేక్షణ అధికారులు కుమ్మక్కై అమాయక ప్రజల నుండి సొమ్ము ను దోపిడీ చేస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ధరల నియంత్రణపై సమగ్ర విచారణ చేపట్టి నిర్వాహకులకు చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్ చేస్తున్నారు.

## మహిళ హత్య కేసును ఛేదించిన గన్నవరం పోలీసులు

**- రూ.56 లక్షల విలువైన బంగారం, నగదు స్వాధీనం**

**- ఇద్దరు నిందితుల అరెస్ట్**

**- విలేకరులు సమావేశంలో కేసు వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ**



**గన్నవరం, మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి) :** కృష్ణా జిల్లా, గన్నవరం సబ్‌డివిజన్ పరిధిలో సంచలనం సృష్టించిన మహిళ హత్య కేసును గన్నవరం పోలీసులు అత్యంత చాకచక్యంగా ఛేదించి, నిందితులను అరెస్ట్ చేసి భారీ మొత్తంలో సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు, ఐపీఎస్ వెల్లడించారు. కేసు వివరాలు : గన్నవరం దావాజీగూడెం రోడ్డులోని జీ.కె.ఆర్ పారడైజ్ అపార్ట్మెంట్‌లో ఫ్లాట్ నెం.401లో నివసిస్తున్న కాజ రజిత కుమారి (55) తన భర్త మరణానంతరం ఒంటరిగా నివసిస్తూ శ్రీనగర్ కాలనీలో జ్యోతి పిండి మర నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆమె ఇద్దరు కుమార్తెలు అమెరికాలో స్థిరపడ్డారు. ది.24-05-2026 రాత్రి సమయంలో మృతురాలు తన కుమార్తెతో ఫోన్‌లో మాట్లాడుతుండగా ఎవరో కాలింగ్ బెల్ కొట్టారని చెప్పి ఫోన్ పెట్టారు. అనంతరం ఫోన్‌కు స్పందించకపోవడంతో అనుమానం కలిగింది. మరుసటి రోజు ఉదయం పనిమనిషి ఇంటికి వచ్చి చూడగా రజిత కుమారి బెడ్‌రూమ్‌లో అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్లు గుర్తించి వెంటనే 112కు సమాచారం ఇచ్చారు. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు గన్నవరం పోలీసులు అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరాలతో కీలక ఆధారాలు.. దర్యాప్తులో భాగంగా అపార్ట్మెంట్ సీసీ కెమెరాలను పరిశీలించగా, మృతురాలికి పరిచయస్తురాలైన పోలవరపు సుష్మ మరియు ఆమె కుమారుడు పోలవరపు అజయ్ కుమార్ 24-05-2026 రాత్రి 10:07 గంటలకు ఫ్లాట్‌లోకి ప్రవేశించి, రాత్రి 11:17 గంటలకు బయటకు వెళ్లినట్లు గుర్తించారు. దీనితో కేసును మర్డర్ ఫర్ గెయిన్‌గా మార్చి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. నిందితుల అరెస్ట్ : జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు, ఐపీఎస్. ఆదేశాల మేరకు గన్నవరం ఇన్‌చార్జ్ డీఎస్పీ పాల శ్రీనివాస్ పర్యవేక్షణలో, గన్నవరం పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జ్ సీఐ ఎల్. రమేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు నిందితుల కోసం గాలింపు చేపట్టాయి. దర్యాప్తులో లభించిన విశ్వసనీయ సమాచారం మేరకు గన్నవరం కోనాయి చెరువు సమీపంలో నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా, వారు నేరాన్ని అంగీకరించారు. స్వాధీనం చేసుకున్న సొత్తు వివరాలు : సుమారు 390 గ్రాముల బంగారం, రూ.1,60,000 నగదు, నేరానికి ఉపయోగించిన ాూ40ఖఖీ8842 ాబఓబనెఆ ాూఏఎవం వాహనం, మొత్తం సుమారు రూ.56 లక్షల విలువైన సొత్తును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నేరానికి కారణం : ప్రధాన నిందితురాలు పోలవరపు సుష్మకు ఓ వ్యక్తితో ఉన్న వివాహేతర సంబంధానికి మృతురాలు అడ్డుగా ఉందనే భావనతో పాటు, ఆర్థిక ఇబ్బందులు కారణంగా మృతురాలి వద్ద ఉన్న బంగారం, నగదును దోచుకోవాలనే దురాశతో ఈ హత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఈ కుట్రలో ఆమె కుమారుడు పోలవరపు అజయ్ కుమార్ సహకరించినట్లు దర్యాప్తులో తేలింది. నిందితుల వివరాలు: 1 . పోలవరపు సుష్మ (43) నివాసం: తాడిగడప, పెనమలూరు మండలం ప్రస్తుతం: శ్రీనగర్ కాలనీ, గన్నవరం, 2 . పోలవరపు అజయ్ కుమార్ (25) ప్రస్తుతం: శ్రీనగర్ కాలనీ, గన్నవరం, అజయ్ కుమార్‌పై గతంలో పలు క్రిమినల్ కేసులు నమోదై ఉన్నాయని, ఉయ్యూరు టౌన్ పోలీస్ స్టేషన్‌లో సస్పెక్ట్ షీట్ కూడా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కేసు ఛేదనలో ప్రతిభ కనబరిచిన అధికారులు : పాల శ్రీనివాస్ -- డీఎస్పీ, గుడివాడ / ఇన్‌చార్జ్ డీఎస్పీ, గన్నవరం, ఎల్. రమేష్ -- సీఐ, గన్నవరం, కె. శ్రీధర్ -- ఎస్సై, ఎం. నాగరాజు -- ఎస్సై, ఎన్. ప్రశాంతి -- ఎస్సై, హెడ్ కానిస్టేబుళ్లు, పోలీస్ సిబ్బంది ప్రత్యేక బృందాలు, ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు, ఐపీఎస్. కేసును వేగంగా ఛేదించి నిందితులను అరెస్ట్ చేసిన పోలీసు బృందాన్ని అభినందించారు.

## డీఎస్సీలో అవకతవకలపై ఎన్టీఆర్ జిల్లా వైఎస్ఆర్సిపి విద్యార్థి విభాగం నిరసన



**విజయవాడ , మే29 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేసిన విద్యార్థి విభాగం నేతలు నిరసన కార్యక్రమానికి భారీగా తరలివచ్చిన విద్యార్థులు, డీఎస్సీ అభ్యర్థులు మెగా డీఎస్సీలో అవకతవకలపై చర్యలు తీసుకోవాలని, సీబీఐ విచారణ జరిపించాలని, మంత్రి నారా లోకేష్‌ను మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ వైసీపీ విద్యార్థి విభాగం ధర్నా నిర్వహించింది. కార్యక్రమంలో పాల్గొన్న ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు దేవినేని అవినాష్, మాజీ మంత్రి వేలంపల్లి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు,ఎన్టీఆర్ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షులు జొన్నలగడ్డ కమల్ సాయి,విద్యార్థి విభాగం స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ రవిచంద్ర మరియు జిల్లా నియోజకవర్గల స్టూడెంట్ వింగ్ అధ్యక్షులు,వైస్సార్సీపీ శ్రేణులు..

## ఫోక్సో చట్టాలపై అవగాహన



**పుట్టపర్తి మే29 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** సత్య సాయి జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు, పుట్టపర్తి మండలంలో శుక్రవారం ఫోక్సో చట్టాలపై శక్తి టీం సభ్యులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యంగా బాలికలు, మహిళలపై జరిగే నేరాలను ఎలా అడ్డుకోవాలి, పోలీసులకు ఎలా సమాచారం ఇవ్వాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు.

## దమ్ము ధైర్యం ఉంటే నరసరావుపేట అభివృద్ధిపై బహిరంగ చర్చకు రావాలి

**- మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి కి, ఎమ్మెల్యే చదలవాడ అంబేద్కర్ విగ్రహం వద్ద చర్చకు సవాల్**



**నరసరావుపేట మే29 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** నరసరావుపేట నియోజకవర్గంలో గత వైసీపీ పాలనలో, ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు రావాలని మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డికి నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు సవాల్ విసిరారు. శుక్రవారం గుంటూరు రోడ్డులోని నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన, పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షులు షేక్ జాన్ సైదాతో కలిసి మాట్లాడారు.

అభివృద్ధిపై బహిరంగ చర్చకు సవాల్

ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ "గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన అభివృద్ధి, కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఈ రెండేళ్లలో జరిగిన అభివృద్ధిపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నాం. నరసరావుపేట నడి సెంటర్లోని అంబేద్కర్ విగ్రహం వద్ద బహిరంగ చర్చకు రావాలి. ఊరికే విమర్శలు చేయడం కాకుండా దమ్ము ధైర్యం ఉంటే విధానపర చర్చకు రావాలి" అని మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డిని ఉద్దేశించి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు సవాల్ చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో "రాక్షస పాలన" కొనసాగిందని, అక్రమ కేసులు, గంజాయి కేసులు పెట్టి అమాయక పల్లె ప్రజలను హింసించారని ఆయన ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సంక్షేమం, అభివృద్ధి పరుగులు పెడుతున్నాయని స్పష్టం చేశారు.

అమరావతి, విశాఖ అభివృద్ధిపై వ్యాఖ్యలు

గత వైసీపీ పాలనలో రాష్ట్ర రాజధాని అమరావతిని శిథిలావస్థకు చేర్చారని ఎమ్మెల్యే విమర్శించారు. కూటమి పాలనలో గత రెండు సంవత్సరాల కాలంలో అమరావతి రాజధాని అభివృద్ధి వేగంగా జరుగుతోందని, రోడ్ల అనుసంధానం చేస్తూ పారిశ్రామికవేత్తల నుంచి పెట్టుబడులను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. వైసీపీ మూడు రాజధానుల నినాదంతో రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారని మండిపడ్డారు. విజనరీ లీడర్ చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో వైజాగ్‌లో టెక్నాలజీ పరంగా అభివృద్ధి జరుగుతోందని, గూగుల్ డేటా సెంటర్, క్వాంటం వ్యాలీ ప్రాజెక్టులు వేగంగా జరుగుతున్నాయని వివరించారు.

నియోజకవర్గంలో రూ.100 కోట్లతో అభివృద్ధి పనులు

నరసరావుపేట నియోజకవర్గంలో రూ.100 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని డాక్టర్ అరవింద బాబు వెల్లడించారు. ముఖ్యమైన పనుల వివరాలను వెల్లడించారు.

గత వైసీపీ ప్రభుత్వం అంజుమన్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేస్తే, కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రైవేటు నిధులు రూ.50 లక్షలు సేకరించి అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.

గోపిరెడ్డి కళ్లుండి చూడలేని గుడ్డివాడు

మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి "కళ్ళుండి చూడలేని గుడ్డివాడిగా మారి దుర్మార్గపు ఆలోచనలు కలిగి ఉన్నాడు" అని ఎమ్మెల్యే తీవ్ర వ్యాఖ్యలు చేశారు. శానిటేషన్ పరిశీలన పేరుతో వందల మందిని తీసుకొని పర్యటించడం కేవలం రాజకీయ దురుద్దేశమేనని ఆరోపించారు.

డిజిటల్ మహానాడులో పల్నాడుకు 3వ ర్యాంక్

టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షులు షేక్ జాన్ సైదా మాట్లాడుతూ పల్నాడు పార్లమెంటు పరిధిలోని 76 క్లస్టర్లలో డిజిటల్ మహానాడు నిర్వహణకు రాష్ట్రవ్యాప్తంగా మూడవ ర్యాంకు వచ్చిందని తెలిపారు. కార్యకర్తలందరికీ ధన్యవాదాలు తెలిపారు.డిజిటల్ మహానాడు జగన్‌ను తిట్టటానికి పెట్టుకున్నారని వైసీపీ దుష్ప్రచారం చేస్తోంది. ఎప్పుడూ విదేశ పర్యటనలో బిజీగా ఉండే జగన్ మోహన్ రెడ్డి సడన్‌గా మే 27న తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో వైసీపీ కేడర్‌ను పిలిపించుకుని డైవర్షన్ పాలిటిక్స్ చేశారని ఆరోపించారు.

2029లోనూ కూటమిదే అధికారం

వైసీపీ పాలన "గొడ్డలి పాలన" అని, కక్షపూరితంగా కులమత రాజకీయాలు చేస్తూ వ్యవస్థను డిస్టర్బ్ చేశారని జాన్ సైదా విమర్శించారు. గత రెండు సంవత్సరాలుగా కూటమి పాలనలో రాష్ట్రంలో ప్రశాంత వాతావరణం నెలకొందని అని అన్నారు. 2029లో కూడా కూటమిదే అధికారం చేపడుతుందని ధీమా వ్యక్తం చేశారు. వినుకొండ, నరసరావుపేట మాజీ ఎమ్మెల్యేలు బొల్ల బ్రహ్మనాయుడు, గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డిలు "అరాచకవాదులుగా మారారు" అని విమర్శించారు. శాసన సభ్యుడిగా ఉన్న బొల్ల బ్రహ్మనాయుడు ఏకవచనంతో బూతులు మాట్లాడటం వైసీపీ విధానాలను తెలియజేస్తోందన్నారు. అయినా 20 సంవత్సరాల రాజకీయ జీవితంలో ఒకసారి గెలిచి అవాకులు చవాకులు పేలుస్తున్నారని అన్నారు.

కూటమి ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ రిలీజ్ చేసి, మెగా డీఎస్సీ ద్వారా టీచర్ ఉద్యోగాలు కల్పించి ఉద్యోగ కల్పనకు కృషి చేస్తోందని అన్నారు. అభివృద్ధి గురించి మాట్లాడే అర్హత వైసీపీకి లేదని స్పష్టం చేశారు. నిజాయితీగా పనిచేయాలంటే ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబును చూసి నేర్చుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మహిళా నేతలు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రి గన్నవరం పర్యటన...



**మచిలీపట్నంమే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని జౌళి రంగంలో ప్రముఖ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అన్ని విధాల కృషి చేస్తామని కేంద్ర చేనేత జౌళి శాఖ మంత్రివర్యులు గిరిరాజ్ సింగ్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రెండు రోజుల పర్యటనలో భాగంగా తొలిరోజు శుక్రవారం ఉదయం కేంద్ర చేనేత జౌళి శాఖ మంత్రివర్యులు గిరిరాజు సింగ్ కృష్ణాజిల్లా గన్నవరం లోని విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకొని అటు నుంచి నేరుగా బాపులపాడు మండలంలోని మల్లవల్లి పారిశ్రామిక వాడలో ఉన్న స్పిన్ టెక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమను సందర్శించారు. రాష్ట్ర బీసీ ఈడబ్ల్యూఎస్ సంక్షేమం చేనేత జౌళి శాఖ మంత్రివర్యులు సవిత , స్పిన్ టెక్స్ ఇండియా లిమిటెడ్ ఎండి వల్లభనేని సుధాకర్ చౌదరి మంత్రికి పుష్పగుచ్చాలు అందజేసి సాదర పూర్వకంగా స్వాగతం తెలిపారు. అనంతరం కేంద్ర మంత్రి స్పిన్ టెక్స్ ప్రాంగణంలో పారిశ్రామికవేత్తలతో సమావేశం నిర్వహించి పట్టు పరిశ్రమ తదితర పరిశ్రమల ఏర్పాటుపై చర్చించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రెండు రోజుల పర్యటనకు వచ్చానని అందులో మొదటి రోజు విజయవాడలోనూ రెండవ రోజు విశాఖపట్నంలో పర్యటిస్తున్నా మన్నారు. ముఖ్యమంత్రినీ కలిసి, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ ను ఒక జౌళి రంగ ప్రముఖ రాష్ట్రంగా ఎలా అభివృద్ధి చేయవచ్చనే విషయంపై చర్చిస్తామన్నారు. ప్రముఖ. ఆంధ్రప్రదేశ్ ఏ రంగంలోనైనా ముందుకు వెళ్లగలిగే సామర్థ్యం ఉన్న రాష్ట్రం అన్నారు.. ముఖ్యంగా పత్తి (కాటన్) విషయంలో ప్రపంచవ్యాప్తంగా హెక్టారుకు 2000 కిలోల దిగుబడి వస్తుండగా, భారతదేశంలో మాత్రం సగటు 450 కిలోల మాత్రమే వస్తోందన్నారు. . ఈ పరిస్థితిని ఎలా మార్చాలి? విత్తనాల (సీడ్స్) విషయంలో ప్రత్యేక విధానం అవసరమా? రాష్ట్రంలో పత్తి ఉత్పత్తి అత్యధికంగా ఎలా పెంచాలి? అనే అంశాలపై చర్చించామన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ చేనేత రంగానికి ఎంతో ప్రసిద్ధి చెందిందన్నారు. ఇటీవల ఒక క్లస్టర్‌ను మేము ఆమోదించామన్నాడు. మరో క్లస్టర్‌ను కూడా అభివృద్ధి చేయాలని భావిస్తున్నా మన్నారు. చేనేత రంగం రాష్ట్రానికి ఎంతో ముఖ్యమైనదన్నారు. ఈ రంగాన్ని మరింత అభివృద్ధి చేయడం గురించి మంత్రితో, ముఖ్యమంత్రితో చర్చించడం జరిగిందన్నారు. . ఇప్పటివరకు చేనేత రంగానికి పేరుగాంచిన ఆంధ్రప్రదేశ్, ఇకపై జౌళి రంగంలో కూడా ప్రముఖ కేంద్రంగా ఎదగాలున్నది తమ లక్ష్యం అన్నారు . ముఖ్యంగా సాంకేతిక పరంగా జౌళి రంగం ప్రపంచవ్యాప్తంగా వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. . రేపు తాను విశాఖపట్నం లో గ్లాస్ ఫైబర్ యూనిట్‌ను ప్రారంభించబోతున్నానన్నారు. . గ్లాస్ ఫైబర్, కార్బన్ ఫైబర్, గ్రాఫీన్ వంటి ఆధునిక రంగాల్లో అవకాశాలు ఎక్కువగా ఉన్నాయ న్నారు. భారత ప్రభుత్వం జౌళి రంగానికి రూ.10,860 కోట్ల పీఎల్ఐ (ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్) ప్రకటించిందన్నారు. అందులో ఆంధ్రప్రదేశ్ ఎక్కువ వాటా పొందాలని ముఖ్యమంత్రినీ కోరబోతున్నామన్నారు. .. మొత్తం రూ.11 వేల కోట్ల ప్రోత్సాహకాల్లో రాష్ట్రం అధిక భాగస్వామ్యం పొందడం అవసరమన్నారు.. ఈ విషయాన్ని చెప్పేందుకే తాను వచ్చానని. ఇంకా కొన్ని చిన్న చిన్న అంశాలపై కూడా చర్చిస్తామన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వ 12 ఏళ్ల పాలనలో ప్రజల్లో ఆశను నింపారన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ ఎంతగానో అభివృద్ధి చెందిందన్నారు. కరోనా సమయంలో ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక వృద్ధి ఆగిపోయిందనీ, మోదీజీ నాయకత్వంలో భారత్ అభివృద్ధిని కొనసాగించిందన్నారు. 2022 తర్వాత మోదీజీ పెట్రోల్, డీజిల్ ధరలను పెంచలేదన్నారు మొత్తం మీద రూ.10 మాత్రమే పెరిగిందన్నారు. . కానీ అమెరికా వంటి దేశాలు రెండు నెలల క్రితమే 44 శాతం వరకు ధరలు పెంచాయన్నారు. చైనా, జపాన్, జర్మనీ కూడా ధరలు పెంచాయన్నారు. . మన దేశానికి స్వంతంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ లేనప్పటికీ మోదీజీ సమర్థంగా నిర్వహిస్తున్నార న్నారు. ఇటీవల యూఏఈతో కుదిరిన ఒప్పందం దేశ ప్రయోజనాలకు ఉపయోగప డుతుందన్నారు. కరోనా సమయంలో మోదీజీ ప్రపంచానికి భారత సామర్థ్యాన్ని చూపించినట్లే, ఇప్పుడు కూడా దేశాన్ని మరింత బలంగా ముందుకు తీసుకెళ్తారని తనకు పూర్తి నమ్మకం ఉందన్నారు. ఈ 12 సంవత్సరాలను పోల్చితే – -- ఆర్థిక వ్యవస్థలో, ఎగుమతుల్లో, మౌలిక వసతుల్లో పెద్ద ఎత్తున పురోగతి వచ్చిందన్నారు. విద్యా రంగంలో ఐఐటీలు, ఎయిమ్స్‌లు, మెడికల్ కళాశాలలు పెరిగాయన్నారు. మోదీజీ దేశంలోని ప్రాథమిక రంగాలను ఉన్నత స్థాయికి తీసుకెళ్లారన్నారు. .మోదీజీ 2047 లక్ష్యంగా పని చేస్తున్నారనీ. అనాటికి భారత్ ప్రపంచంలో అగ్రగామి దేశాల్లో ఒకటిగా నిలుస్తుందనే నమ్మకం తనకు ఉందన్నారు. తదుపరి స్పిన్టెక్స్ పరిశ్రమ ప్రాంగణంలో కేంద్ర మంత్రి మొక్కలు నాటి, పుంగనూరు ఆవులను, దూడలను ఎంతో ఆప్యాయంగా నిమురుతూ ప్రతి ఇంట్లోనూ చిన్న పాటి పరిమాణంలో ఉన్న ఇటువంటి పుంగనూరు ఆవులను పెంచుకోవాలన్నారు. అనంతరం పుంగనూరు ఎద్దులను, ఒంగోలు గిత్తలను పరిశీలించారు. తదనంతరం కేంద్ర మంత్రి ప్రాంగణంలోని జౌళి పరిశ్రమ యూనిట్ సందర్శించి తయారీ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి వెంట రాష్ట్ర చేనేత జౌళి శాఖ కమిషనర్ రేఖా రాణి, కృష్ణ జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, కేంద్ర సిల్క్ బోర్డ్ సభ్య కార్యదర్శి సిఈఓశివకుమార్, డైరెక్టర్ గిరీష , కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధి నీరబ్ కుమార్, కేంద్ర జౌళి కార్పొరేషన్ గుంటూరు డివిజనల్ కార్యాలయ డిప్యూటీ అనధికారులు పాల్గొన్నారు.

## మహిళా భద్రతపై రిమ్స్‌లో అవగాహన సదస్సు




**కడప మే29 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** కడప నగర శివారులోని రిమ్స్‌లో 'ఆపరేషన్ దండయాన్'లో భాగంగా మహిళా భద్రతపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ షెల్కే నచికేత్ మాట్లాడుతూ, మహిళల రక్షణకు పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, నేరగాళ్లపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇప్పటికే 197 మందిపై షీట్లు తెరిచినట్లు ఆయన వెల్లడించారు. సోషల్ మీడియా వాడకంలో జాగ్రత్తలు పాటించాలని, ఆపద సమయంలో డయల్ 112, శక్తి యాప్‌లను ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ ప్రకాష్ బాబు కూడా పాల్గొన్నారు.

## మడ అడవులు ఆక్రమించి చెరువులు తవ్విన వారిపై చర్యలు తీసుకోండి

**సీనియర్ అడ్వకేట్ జి.వి.రమణ.**



**మచిలీపట్నం మే29 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** మడ అడవులు ఆక్రమించి చెరువులు తవ్విన వారిపై చర్యలు తీసుకోవాలని సీనియర్ అడ్వకేట్ జివి రమణ కోరారు. జివి రమణ శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ సముద్ర గర్భం నానాటికి కుచించుకుపోతోందని, మడ అడవులు అంతరించిపోతున్నాయని ఆవేదన చెందారు. సముద్ర తీరశీ వెంబడి గ్రామాల ప్రజల రక్షణ దినదిన గండంగా మారుతోందని ఆవేదన చెందారు. కొందరి స్వార్థపరుల దురాక్రమణ, భూ కబ్జాదార్ల మితిమీరిన భూదాహం, అక్రమార్జన, స్వార్థ రాజకీయపరుల స్వలాభము,అధికారుల నిర్లక్ష్యం, అవినీతి వంటి కారణంగానే సముద్ర తీరం వెంబడి ప్రభుత్వ, పంచాయితీ ఫారెస్ట్, అసైన్డ్ భూములు అన్యాక్రాంతమవుతున్నాయన్నారు. సాక్షాత్తు రాష్ట్ర మంత్రి ఇలాకాలోనే చట్టాల ఉల్లంఘన పర్యావరణ విఘాత చర్యలు, భూకబ్జాలు చోటు చేసుకోవడం జరుగుతోంది.

బందరు రూరల్ మండలం, పెదపట్నం గ్రామపంచాయతీ పరిధిలోని 181, 182/1,182/2,155/ఈూ155/దీ లలో సుమారు 40 ఎకరాల గ్రామపంచాయతీ ఆస్వాదిన అసైన్డ్, దిబ్బ, ఫారెస్ట్ భూములు అన్యాక్రాంతానికి గురయ్యాయి. ఆక్రమణదారులు సముద్రానికి రక్షణగా ఉన్న మడ అడవులు నరికివేసి ఆ భూముల్లో చెరువులు తవ్వారని అన్నారు. ఆక్రమణదారులు ఆ ప్రాంతంలో తమకున్న 16 సెంట్లు భూమిని చూపుతూ ఈ భూకబ్జాకు పాల్పడినట్లు సమాచారం.


సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు పాతర వేసి నిబంధనలకు విరుద్ధం గా ప్రవర్తించారన్నారు.

పెదపట్నం గ్రామంలో యదేచ్ఛగా సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు పాతరేస్తున్నారన్నారు .సి ఆర్ జెడ్ నిబంధనలు తుంగలో తొక్కుతున్నారన్నారు. సి ఆర్ జెడ్ జోన్ వన్ నిబంధన ప్రకారం సముద్రానికి 500 మీటర్ల లోపు ఎలాంటి ఆక్రములకు పాల్పడకూడదు. మడ అడవులు నరకడం, భూముల ఆక్రమించి చెరువులు తవ్వడం, పర్యావరణానికి విఘాతం కలిగించడం, వన్యప్రాణులకి నష్టం కలిగించే చర్యలు చేపట్టడం చట్టరీత్యా నేరం అన్నారు. ఇవేమీ పట్టకుండా బంటుమిల్లి కి చెందిన ఓ న్యాయవాది పట్టపగలే మడ అడవులు నరికి చెరువులు తవ్వి భూ కబ్జాకు పాల్పడి సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు సవాల్ విసిరారని జీవీ రమణ ఆరోపించారు. ఆక్రమణలతో సముద్రం ఘోషిస్తున్న అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం విడ్డూరంగా ఉందన్నారు.

జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు

పెదపట్నంలో భూముల ఆక్రమణ, మడ అడవులు నరికి చెరువులు తవ్విన ఘటనపై జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు అందింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, సి ఆర్ జెడ్ జోన్ వన్ నిబంధనలకు వ్యతిరేకంగా అధికారులు అండదండలతో 40 ఎకరాలు ఆక్రమించారని మచిలీపట్నానికి చెందిన న్యాయవాది జీవీ రమణ జిల్లా కలెక్టర్ బాలాజీ ని కలిసి ఫిర్యాదు అందజేశారు. అంగర రంగనాథ్, అంగర రామ్మోహన్ రావు, అంగర వెంకట నవీన, అంగర రమాదేవి, అంగర రజిని, అంగర అరుణ్ కుమార్ లు ఈ ఆక్రమణకు పాల్పడి మడ అడవులు నరికి చెరువులు తవ్వారని, బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకుని సహకరించిన అధికారులపై శాఖాపరమైన చర్యలు చేపట్టి భూములు స్వాధీనం చేసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

## మైలవరంలో వర్చువల్ మహానాడు విజయవంతం.



**విజయవాడ , మే29 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు గారి కృతజ్ఞతలు. మైలవరం నియోజకవర్గంలో 11 క్లస్టర్లలో వర్చువల్ మహానాడు కార్యక్రమం విజయవంతమైందని మైలవరం ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణప్రసాద్ గారు తెలిపారు. శుక్రవారం ఒక ప్రకటనలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. తెలుగుదేశం పార్టీ బలాన్ని మహానాడు ద్వారా మనమందరం చాటుకున్నామని పేర్కొన్నారు. పసుపు సైనికులంతా ఐక్యంగా కదిలి కార్యక్రమాన్ని విజయవంతం చేశారని కొనియాడారు. రాష్ట్ర అధికార ప్రతినిధి హోదాలో మహానాడు విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరినీ అభినందించారు. అన్న ఎన్టీఆర్ గారి స్ఫూర్తితో, సీఎం చంద్రబాబు గారు, టిడిపి వర్కింగ్ ప్రెసిడెంట్ మంత్రి నారా లోకేష్ గారి నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతమవుతుందన్నారు. క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీల సమన్వయంతో కార్యక్రమం సజావుగా జరిగిందన్నారు. రాబోయే ఎన్నికల్లో కూటమి విజయానికి ఇదే స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు. మహానాడు స్ఫూర్తితో ప్రజల్లోకి వెళ్లి పార్టీని మరింత చేరువ చేయాలని పిలుపునిచ్చారు.

## ఆర్టీసీ డిపో అభివృద్ధిపై ఎమ్మెల్యే కృష్ణారెడ్డి ఫోకస్



**కావలి మే29 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** కావలి ఆర్టీసీ డిపోలో ప్రయాణికుల సౌకర్యాలు, పారిశుద్ధ్యం, తాగునీరు, టాయిలెట్ల నిర్వహణపై ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి, ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి సమీక్షించారు. డిపోను పరిశీలించిన ఎమ్మెల్యే, మహిళా శక్తి పథకం తర్వాత ప్రయాణికులు పెరిగారని తెలిపారు. రోటరీ క్లబ్ సహకారంతో ఉచిత ఆర్. ఓ ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. విద్యార్థుల రవాణా, కొత్త బస్సులు, గ్రామీణ రూట్ల విస్తరణపై అధికారులతో చర్చించారు.

Edited, Printed, Published and Owned by K.S. Rangasayi and published from D.No: 1-3/21-16, Kamakotinagar, Vidyadharapuram, Vijayawada-520 012. (A.P.) and Printed at SKYLINE PRESS, D.No: 1-3/21-16, Kamakotinagar, Vidyadharapuram, Vijayawada-520 012. (A.P.), Associate Editor : K. Neeraja, Ph: 0866-2411299. E-mail: netimanadesam.vja@gmail.com